# తల్లి కడుపులోకి...

ఈ దారెటు పోతుందో?... యెటు పోతుంది?... నీరు పల్లానికి పోతుంది. నిప్పు అంటుకున్న వేపుకి పోతుంది. గాలి పీడనాన్ని బట్టీ పోతుంది..... యెటొచ్చీ మనిషే... యెటయినా పోగలడూ రాగలడు!

ఇప్పుడెటు పోతున్నట్టూ?

... అది తెలిస్తే కదా... గమ్యం తెలిస్తే కదా.... తోవయెటు పోతున్నదీ తెలిసేది. పేగు తెగాక ఈ వెలుగో చీకటో కళ్ళని యిలా కమ్మేస్తున్నదేమిటి? కళ్ళేనా భగ్గుమంటున్నది? ఆమంట గుండెకింద ఆరని సెగది కాదూ...?!

"ఆరిందం... ఆరిందం...

అయిదరబాదు అల్లరి పెడతంది...

దానెమ్మా బాబో... దీని తస్సా దియ్యో..

సికాకుళం తుపాకి బండి... ఛల్... ఛల్... ఛల్...

బండంటే బండి గాదురా నగ్జలబరి నాటుబండిరా

ప్రజాయుద్ధపు పిస్తోళ్ళ బండిరా... వహో... వహోఁ... యెహే యెహేఁ...!!!

... పుధృతమైన గాలి... చిలికి చిలికి నిప్పుని రాజేసింది. నీరు పల్లానికీ నిజం డెప్పికీ యెగబాకి పోయింది! పుస్తకాల్లోంచి పురుగు... పుటలమధ్య యిరుక్కొని ఆనవాళ్ళే దొరక్కుండా... అంటుకు పోయి అట్టగట్టుకు పోవాల్సింది... అలాంటిది పచ్చ పచ్చగా ఆ నల్లని వెన్నెల రాత్రి అడవికే యెగ బాకి పోయింది!

ఇప్పుడూ తూపాకీ బండే!

ముందు యెనమండుగురు భటులు... కత్తుల తూపాకీలతో కదిలిపోతున్నారు. వాళ్ళ వెనుక

జీపులో మరో యెనమండుగురి మధ్య... కనపడని సంకెళ్ళ మధ్య కదలకుండా మెదలకుండా.. శవంలా... 'నేను' ... నేనేనా?!

వెనక మరో కారు.. కారులో తెల్లని పసుపు చొక్కాల పక్కన మాసిన చెమట పాతలు దేన్నో దేవున్నో ధ్యానిస్తూ...

అవెనక ఎస్కార్టు కాకీలు... టోపీలు! తుపాకులు!

తోవ పొడువునా పోలీసుసైన్యం... రోడ్ల కిరువైపులా చెట్టై.. దడిగట్టిన ఎలువులై! ఎప్పటికప్పుడూ పాతదే అయినా అప్పటి కప్పుడూ కొత్తగా కూడా వుంది!

ఆ రాత్రి కొత్త సూర్యోదయాన్ని చూసాడు...

అవును... ఆరాత్రి వెన్నెల్ని తాగాడు... పడిలేచే గాలిని వేణువు చేసి వూదాడు. నిప్పుని చేతుల్లోకి తీసుకొని గుండెలకు పొదువుకున్నాడు. తన కళ్ళలోని మెరుపు తెల్పడానికి ఆకాశం మెరిసింది. గుండెపట్టని సంతోషం వురుమై వురిమింది... అమ్మ కడుపులా అనంతాకాశమూ యెంత గుడగుడమందీ?

యిప్పుడు... కడిగేసిన వాన! తేలిపోయిన మబ్బు! తెరిపిచ్చిన ఆకాశం...! అంతా వదులుకున్నా ... మోసుకొస్తున్న ఈ భారమేమిటి? ప్రకృతి యెంత ప్రశాంతంగా వుందీ? శవం... శవం'... యిల్లు దాటిన ప్రశాంతత!?

యిప్పుడేగుతున్నది శ్మశానానికేనా?

తగలబడుతున్న మనిషిని యింకా తగలబెట్టేదేమిటి?

పెదవి చివర వైరాగ్యం వంకర పోయి చిట్లదేం...? కంటిలోయల్లోంచి యెప్పుడూ వూట బావులయిన గుడ్లు వొక్క చుక్కనీ జార్చవేం? ఆకు అలికిడికే అటెన్షన్‌లోకొచ్చే అద్భుత శరీరం చచ్చుబడిపోయినట్లు చలనం లేదేం?

యిది ఎప్పుడు ప్రారంభమయిందీ?

... నిన్న రాత్రో... వారం క్రితమో... నియోజకపు వర్గ నిధుల కోటయింట మొదలైందా? లేదు... లేదు... ఆరుమాసాలక్రితమే!... మూడు మాసాలుగా మంతనాలు సాగి సాగి... యివాల్టికో ముడిపడ బోతోంది. మెడకా?.... రచించిన పథకం అనుకున్నదే... అక్కడా యిక్కడా అనుమతి తీసుకున్నదే...?!

భయకంపితమై.. ఆగితే ప్రాణం పోతుందన్న రీతిలో.. పరుగుతీసి.. రోడ్డంతం చూసి... మధ్యాహ్నపు వేళ... జిల్లా కేంద్రం... పోలీసుకోటలోకి.. వొచ్చి వాహనాలు ఆగాయి. తుపాకులూ తూటాలూ జారుకోలేదన్నట్టు తడిమి సర్దుకున్నారు.

'శవం'... యీ శవం చుట్టూ చేరి నలుగురు పట్టుకొని నడిపించారు.

రాజ దర్పంతో విజయ దరహాసం యెదురు చూస్తున్నట్టు.. చూసి.. నవ్వి... పలుకరించింది. అందరూ దండాలు పెట్టారు.

యీ వేషం చేత కూడా!... దండాలా? దండీలా!?

వీరులార శూరులార...

గెరిల్లా యోధులారా..

అందుకోండి ఎర్ర దండాలు...

మీరందుకోండి ఎర్ర దండాలు.... వీరులారా-....'

... చేతులు తెగిపోతే బాగున్ను. యింకా తెగి పోలేదా? చలనముందా?

ఆడబోయే నాటకానికి అన్ని రిహార్సల్సూ మొదలయి పోయాయి. యే వేషం... యే భాష... యే పలుకూ.. యే పాటా.. యే మాటా?!

ఒకే రచన!

సిద్ధమైన పాత్రలు!

ప్రాథమిక విచారణ. తొలి అంకం. తెరలేచే వుంది. కేసెట్ వేసేవుంది! తలుపులు మూసుకున్నాయి. నొప్పులేకుండా పిల్లను కంటున్నట్టేవుంది.

'... యేదీ చలనంలేకుండా వుండదు. మీ మార్క్సు మాటే. సారీ.. (నవ్వు) ఆ మార్క్సు మాటే! నిజం! చలనముంటుంది. చరిత్రకు కూడా! శాస్త్రం కూడా దిద్దుకోవలసింది అందుకే... కాలం మారుతోంది. మార్పు సహజం! మీరూ నేనూ మనమందరమూ నమ్మాల్సిందే... అంగీకరించాల్సిందే... నమ్మాం.. అంగీకరించాం.. (హిప్నటైజింగా?) .. రష్యా కుప్పకూలిపోయింది. అందుకే. చైనా.. నా కన్నా మాకందరికన్నా... డిప్యూటి దళకమాండర్ (ఇంకానా?)గా చైనా బీటలు వారుతున్న సంగతి మీకే బాగా తెలుసు... యే పోరాట ఫలితాలు యెంత కాలం నిల్చాయి. పోరాడినంత కాలం కూడా పట్టలేదే? పతనం కావడానికి?!...

పోనీ మీరే చెప్పండి?'-

ఎవరిది మైకు? యెవరు శ్రోత?...

... మీరెన్ని చీలికలయ్యారు?... పేలికలయ్యారు? అంతెందుకు మీదళమంతా వొకటే అభిప్రాయంతో వున్నారా? ... ఈచీలికపేలికలతో రామరాజ్యం.. సారీ... (మళ్ళీ నవ్వు) సోషలిజం సాధ్యమేనా? యిన్ని చావులు (వాడిది వొత్తయిన జుత్తే.. చూపిస్తూ) యేం సాధించాయి? మీరొక్కరూ సాధించనిది లేదు...?!

... కన్నతల్లీ కడుపుతీపీ,... కానుకు కూచొనే నీ కంటూ చూసే భార్యా.. జీవితం యెంత అందమైందో యవ్వనాన్ని కాదు, దాని చేష్టల్ని చూసావా?... పిల్లలా.. కనాల్సిందే.. వాళ్ళ కోసం రేపు పడిచస్తావ్... యేమయినా చేస్తావ్.. నువ్వే కాదు.. నేనయినా ... ఎవరిమయినా...

సాగిపోతున్న ప్రవాహం. శవం యెక్కడో అడ్డుకుంది. జానెడు పొట్టా... గుప్పెడు మెతుకులు... యెవడి చేతులు... మరెవడి ముడ్డికింద పీటలు... ఉప్పరక్తకాసారం.. యేళ్ళకి యేళ్ళు చదువుకున్న శాస్త్రాలూ.. నేర్చుకున్న పాఠాలు... ఎత్తుకున్న పాటలు... దించుకున్న దరిద్రపు మూటలు... మోకరిల్లాల్సిందే...

యిటు మోకరిల్లాడు. శవం... శవంలానే వుంటుంది.

జవాబుల్లేవ్, ప్రశ్నల్లేవ్, మాటల్లేవ్, చెప్పుకోడానికేం లేదు. కళ్ళున్నాయి చూసాడు. చెవులున్నాయి విన్నాడు. నోరుంది మూసుకున్నాడు.

అచ్చంగాంధీ గారి కోతిగార్రై పోయాడు!

అందుకే అంతనచ్చాడు.

నిజం, అవున్నిజం..... చేతిలో ఆయుధం లేకపోతే అవయవాలున్నట్టే లేదు..... పని చేస్తున్నట్టేలేదు.

శవానికి పాఠం చెప్పడమైపోయింది.

తోలుతిత్తి తియ్యకుండా తొలి నుండి చెమటపాతలు తెల్లచొక్కాని కళ్ళుకద్దుకున్నాయి.ఆ అరిపాదాల మట్టి తీసి నెత్తికి వీబూది చేసుకున్నాయి.

తెరతీసివుంచిన రంగం మీదికి...

పంచపాండవులు మంచం కోళ్ళలాగ ముగ్గురని చెప్పి రెండు వేళ్ళు చూపించి బోర్డు మీద ఒకటి గీసినట్టు... శవం...తనే! తను తనే అయితే.. కాని... 'నేను నేను కానట్టే' వాళ్ళూ వాళ్ళు కారు. కాని అయినారు!

పంచపాండవుల్లా ఐదుగురు లొంగుబాటు!

నాసిగ్గు చితుక్క చిదిగిపోయింది.

అవమానం అదుపులో వుంచకపోయినా... అవన్నీ అపరిచిత ముఖాలే!

ఐదుగురులొంగుబాటు...(?)

నా 'శాపం'తో సహా... అదే... దళడిప్యూటి కమాండర్‌తో సహాఁ...!?

పగలే లైట్లు వెలిగాయి... ఫోటోలు.... ఫ్లాష్‌లు.... షూటింగ్ ఫోకస్... ప్రెస్‌మీట్!

యస్పీ.. సబ్ కలెక్టర్... ఎమ్మార్వో... యెవరెవరో...

యేవేవో ప్రశ్నలు...! రాసుకుంటూ విలేకర్లూ!

రాసిపెట్టిన సమాధానాలు.

యస్పీ స్పీచి... దళం తుడిచి పెట్టుకు పోయింది. అసలు నక్సలిజమే అంతమయి పోయింది.

'యిక రేపట్నుంచి మీకు డ్యూటీ ల్లేవు...?' శవం లోపలెక్కడో గొంతు పెగలని మనిషి!

ఈయేడు లొంగిపోయిన వాళ్ళ లెక్కలు... పునరావాసం... జన జీవన ప్రవంతి... ఖాళీలేనంత రద్దీగా వుంది....

'టికెట్టు దొరక్కపోతే... మళ్ళీ...' లోపలి మనిషి గొంతెత్తలేదు.

'అనారోగ్యం...' శవం నిజమే చెప్పింది!

'ఉద్యమానికి అనారోగ్యం, యిమడలేక... సిద్ధాంతాలతో విభేదించి జనజీవన స్రవంతిలో

కలిసారు..' పెద్దదెయ్యం వేదమే వల్లించింది.

విరుద్ధమైన రెండు విషయాలూ వొకేవార్తయినాయి!

దెయ్యాని తెర అవాల్టికి దించారు.

సంతకాలూ సరంజామాలూ నీళ్ళూ నిబంధనలూ మామూలే.

'లొంగిపోయినా, ప్రాణలతో వదిలారు.. అదే పదివేలు...' చెమట పాతలు నుదుళ్ళు తుడుచుకున్నాయి 'శవం.. ప్రాణం కాపాడినందుకా?! యిల్లు చేరినందుకా?'

లొంగిపోయినా నినాదమై- ఎర్రెర్రని జెండాయై- ఎగిరిన చిన్నా గుర్తుకొస్తున్నాడు. ఈవాస్తవం కన్నా అవార్తే ఎంత బాగుందీ?!

'బాగోలేదు... వంట్లోనా ... వుద్యమంలోనా?'

అపరాత్రి వేళ యింటి అరుగెక్కుతూ వుంటే-

అయిదారేళ్ళ వయసుగల గుంటడొకడు వాళ్ళమ్మని అమ్మా ఆలీ చేసి బండ బూతులు తిడుతున్నాడు. నోటి కొచ్చింది కూస్తున్నాడు. వాడితల్లి చేతులు చాస్తూ అలాగే నిలబడివుంది!

ఆ గుంటడు నిజమా? నీడా?

## 2

'వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు

మీకు వందనాలు.... వందనాలమ్మో మా బిడ్డలూ...'

తీసివుంచిన తలుపే, పరాయిదైనట్టు.... ద్వారం దగ్గర నిలబడి... క్షణాలు గడుస్తున్నా... గొంతు పెగలదే, చేతులు తట్టవే, అడుగులు పడవే...

'... కావు కావున కాకులరిసితే తలుపు తెరసి పలుకరిస్తం..

ఎవ్వరొస్తరొ చెప్పుమాని తొవ్వచూస్తూ నిలుచుంటం

మీరు కాకమ్మలయ్యి వొస్తారా మా బిడ్డలూ

మా కడుపు తీపి తీర్చి పోతారా...'-

ఏస్పర్శా లేని చేతుల్లో వొడలుతూ వొణుకుతూ చేతులొచ్చి వాలేయి. అనని కళ్ళతో అందిన యెత్తు వరకూ చూసింది, చూసి...

'కొడుకా... నాయినా.... నా తండ్రీ...' దుఃఖం కుమ్మేసి ఆమెను మాటాడ నీయలేదు.

''అమ్మా(...' అని యివతలా గొంతుపెగల్లేదు.

ఆ ముసలి తల్లి కొడుకుని ఆత్మీయంగా తడిమీ తడమకముందే... తల్లి కోడిలాగ అటూయిటూ దిక్కులు చూసింది. అనుమానిస్తున్న జాడల్లేవుగాని... వీధి... వీధంతా గుమ్మా లెక్కింది. చాలని రెక్కల కింద దాచుకునేందుకన్నట్టు గబగబా చెయ్యి పట్టుకు లోపలికి నడిపించుకు పోయింది ముసల్ది.

యింట్లోకి రావడంతోనే నడుమును చుట్టేసి పాదాలమీదకు ఆ ముసలి శరీరం జారిపోయింది. ఎత్తడానికి శక్తి లేనట్టు తనూ నేలన కుప్ప కూలిపోయాడు.

ఒకరొకరూ... నలుగురూ.... పదిమంది యిల్లు పట్టనిజనం.. ఆ అర్ధరాత్రి పూట వూరు తెల్లారినట్టు... ఆయింట యేదో కార్యం జరుగుతున్నట్టు...

అమ్మ నెవరో లేపి కూర్చోబెట్టారు. గొంతెత్తి యేడుస్తున్న దాన్ని వూరడిస్తున్నారు. పక్కకి లాక్కెళ్ళారు.

అమ్మ నుండి అంతా- పరీక్షగా చూస్తున్నారు. ముడుకుల్లో తలదించుకు కూర్చోడం సాధ్యం కాలేదు.

ఆచూపుల్లో అప్పుడే పుట్టిన బిడ్డను చూసుకున్నట్టుంది. రక్త సిక్తమైన వాణ్ని.. రక్తపు ముద్దనో చూస్తున్నట్టు... తన్ను తాకడానికి భయపడుతున్నట్టు.... అందుకే అమ్మ చేతులూ వొణుకుతున్నట్టూ అనిపించింది. వొకరిద్దరు తప్ప అంతా కళ్ళతోనూ, అసలు కళ్ళే కదపని రీతిలోనూ చూపుల పరామర్శలు!

ఎవరో పెరట్లోకి పిల్చుకుపోయారు. స్నానానికి నీళ్ళూ సబ్బూ టవలూ సిద్ధంగా వున్నాయి. చెంబు బకెట్లో ముంచబోతే చేతులు కాలాయి.

'... యింత వేళప్పుడు కదా... చలివేస్తుందని... వేణ్ణీళ్ళు...' వొక్క క్షణం కళ్ళలోకి చూసి చూపు మరల్చుకుంది లంగావోణిలో వున్న పిల్ల.. పిల్లేనా, అమ్మాయి! పోల్చుకోవడానికి కొద్దీగ సమయం పట్టింది. ఆ సమయమూ అనుమానాన్నే కలిగించిందేమో... 'నేనూ స్వరాణ్ని. ... రాజ్యాన్ని ...స్వరాజ్యాన్ని...' తన పేరుని తనే దిద్ది దిద్ది- కళ్ళు నేలకు వాల్చి పరుగుతీసింది, లేదు మాయమే అయ్యింది.

అయిదారేళ్ళ క్రితం చూసాడా? వచ్చీ రాని వయసు, గుర్తుండీ లేని రూపం... ఎంత మార్పు? 'పెద బాప్ప కూతురు స్వరమే..?!

వేణ్ణీళ్ళు... వంటికి పత్తింగా వున్నాయి. ఎన్నాళ్ళకి? కాదు, ఎన్నో యేళ్ళకి...

... వారంకో... పదికో... వొక్కో అప్పుడు నెలకో... అదీ చన్నీటి స్నానం... అది పన్నీటి స్నానమే. చలా మంచా రొజ్జా.. ఏదయినా మునిగితే అదో అమృత గంగే!... కొత్తలో యెలా వుండేది!' రెండు పూటలా స్నానమా? అదేమన్నా భోజనమా? బ్రాహ్మలకీ బర్రెలకీ స్నానంగానీ... నీకూ నాకూయెందుకు? మనం పులులం. పులులు పళ్ళేతోముకోవు.. స్నానమొకటా?...' విశ్వంగాడు కొత్త విశ్వాన్నే పరిచయం చేసాడు. యెలావున్నాడో?...

ఒకరొకరూ గుర్తొస్తుంటే...

అమ్మయేడుపు అన్నిటినీ తెంపేసింది...

గొంతెత్తి రాగం తీసి యేడుస్తోంది. ఊరు ప్రతిధ్వనిస్తోంది...

'... నీకష్టం సూడలేదు కొడుకా... నీ సుకం సూడలేదు కొడుకా... సుట్టపు సూపుగా వొచ్చినావా కొడుకా.. మీయమ్మ సచ్చిందని సూడ్డానికొచ్చినావా కొడుకా... తలకొరివి పెట్టేసి పోరా కొడుకా..

మీయయ్య యిపన్నీ సూడలేక ఎలిపోనాడా కొడుకా... మీయయ్య నీకు తెల్దురాకొడుకా...!'

ఆ ఏడుపు గుండెని జలదరింపజేస్తోంది.

అడవి మధ్యలో గూడు తప్పి వొంటరిగా వుండిపోయిన పక్షిలా ఆ దుఃఖం... ఆస్వరం కడుపుని దేవుతోంది.

అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎవరికంట పడనంత వేగంగా చిమ్మీ చిమ్మక ముందే తుడిచేసుకున్నాడు.

యింట్లోకి వచ్చాడు.

ఎవరో తను వచ్చినట్టు... యేడుపు ఆపమన్నట్టు కేకలేసారు.

''... యేడని లేరా.. యిది వొక్కరోజు దుఃఖమురా... యియ్యాలొక్కరోజు తీసిన యేడుపురా.. యే.. నువ్వెళ్ళినావో.. అదిమొదలు యిదిగో యిప్పుడుదాక కంటికీ మంటికీ యేకదార. వొసపిట్ట...! అపస్తదీర యేడ్సినిలేరా... కొడుకు కళ్ళ ముందుంటే రేపుట్నుంచి యింకేటనియేడుస్తాది?...!''

తనకు చెపుతున్నారా? తిరిగి తనేం చెప్పగలడు?

అమ్మ ముక్కు చీదింది. అన్న మొడ్డించడానికి లేచింది...

అన్నయ్యా మావయ్యా ఎవరెవర్నో పరిచయం చేస్తున్నారు. ఆడికెందుకు తెలీదురా?'' మరెవరో అంటున్నారు. ఎవరో చిన్నాయినని మావయ్యనేసాడు. 'పరవాలేదులేరా అంకులంటే యింగ్లీషులో రెండూ గదా... అలాగే సరిపెట్టుకుంటాను' అంటున్నాడతను. నవ్వుతూనే. మరేవో పరిచయాలు గుర్తొస్తున్నాయి, అందుకేనేమో తను నవ్వలేకపోయాడు.

స్వరం అన్నానికి పిలుస్తోంది..

''మీ బావకా ఆకలి.. నీకా... ఎవులికే...' పక్కింటి ముసిల్దాయి యికట మాడింది.

'నీకెక్కువ ఆకలి, నువ్వొచ్చియ్యేఁ..' ముసల్దాన్తో అంది ఆపిల్ల గడుసుగానే.

''అలగే నీను వొచ్చితే నువ్వూరుకుంతావేఁ? నీను వొడ్డిస్తే నువ్వూరుకుంతావే? నన్ను పెళ్ళాడితే గాని నువ్వూరుకుంతావా? వురేసుకోవూఁ...'' ముసల్దాయి డొక్కాడిస్తోంది. ఆమె బుగ్గల ముడతల్లోంచి నవ్వుజారేపోయింది.

''ఎవులుకోసమెవులు పుట్టారో, యిప్పుడవన్నీ యేల?' వదిన, 'స్వరం' వాళ్ళ అక్క నవ్వకుండా తడుముకోకుండా అంది.

ఎవరెవరో తడుముకున్నారు. నవ్వులు తెగిపోయాయి.

కంచం ముందు కూర్చున్నాడు. ఎమ్మెల్యే ఋణం ఈ జన్మకి తీరదని అంతా తీర్మానించుకుంటున్నారు.. ఈ దపే కాదు, యేదపా ఓట్లు ఆయనకే యెయ్యాలంటున్నారు. పేసులుంటాయంటున్నారు. నెమ్మదిగా యెత్తించెయ్యమా అంటున్నారు.

తనే యెందుకో తెగిపోయాడు.

'ఈ విలాసకర విప్లవ జీవితంలో అప్పుడప్పుడూ దొరికేది ఈ అన్నం..' భాస్కర్ కవితనో, పిడికిట్లో అన్నాన్నో చూపిస్తున్నాడు.

పంటికింద రాయి పడిందా?

అన్నం తినడం మరి వశం కాలేదు, లేచి వెళ్ళాడు.

పొద్దున్న స్టేషనుకు పోవాలని యిక నిద్రపోండని మావయ్య కేక లేస్తున్నాడు. ఎటు వాళ్ళటు పోతున్నారు. 'మళ్ళీయానికి?' 'తెల్లారి మాట్లాడు కుందుంలేఁ..' 'అయితే సరి...' సెలవు తీసుకుంటున్నారు.

పెరడ్లో కోడి పుంజు కూత కొచ్చినట్టుంది.

'అమ్మోరికి సల్లదనం సెయ్యాల...' అమ్మ స్వగతంగా పైకే అంటోంది.

స్వరం కాక వదినే పక్కగదిలో పరుపులు పరిచి వచ్చింది. వెళ్ళాడు, కొత్త స్థలమా? నిద్ర రాకుండా వుంది. పక్క మీద దొర్లాడు. పాల్తీన్ కవర్లో చప్పుడికి ఎవరో సెంట్రీకేక వేసినట్టయింది.

... అదే కవర్లో కొవ్వొత్తి పెట్టుకు చదువుకుంటున్న కవిత్వం...

సముద్రుని కవిత్వపు పాదాలు... యిక్కడా యిప్పుడూ వెంటాడు తున్నాయి!

"చావు ద్వారం వద్ద నిలబడి పిలుస్తుంటే

గేలిచేస్తూ పగలబడి నవ్వేవారెవరు?

కబళించిన చావును తిరిగి, విసిరి

గోడకు దిగ్గొట్టిన వారెవరు?"

దుప్పటి వెచ్చగా వున్నా, వొళ్ళంతా చల్లబడిపోయింది!?

## 3

అక్కడా యిక్కడా తచ్చాడకుండా- మఫ్టీలో వున్న పోలీసు అరుగుమీద కూచొనే వున్నాడు. అమ్మిచ్చిన టీ తాగుతున్నాడు. యేదో మాట్లాడుతున్నాడు?!

'మాలోని వాడివే మా వాడివే నీవు...

పొట్ట కూటి కోసం పోలీసు వయినావు...'

తనని చూడ్డంతోటే లేచి నిల్చున్నాడు. మాటలాపేసాడు. అమ్మ యేదో అంటోంది. ఆగకుండా వెళ్ళిపోతున్నాడే... 'యేంలేదు.. వొట్టినే .. యేం సేస్తన్నారో... సూసుకోనెల్దామని... డూటీకాదు, పనుండొచ్చినా...' మాటలు దూరమౌతున్నాయి.

అందుకేనా పల్లెలు గొంతుమార్చుకున్నాయి...?!

'పోలీసోళ్ళు పల్లెకు వస్తే పాతర బెట్టాలె...

మందు పాతర బెట్టాలేఁ... -

అయినా కోరలు తీసిన పాముని చూసి యెందుకు భయపడుతున్నాడు?

కోరలు తీసినా యింకా తనని పాముగానే చూస్తున్నాడా? వొత్తొత్తి పామా? నిజంగా పామా? కాకపోతే వాళ్ళూదే నాదస్వరానికి తనూ తలూపుతున్నాడే?! ఆడమన్నట్టల్లా ఆడుతున్నాడే... యింకెంత ఆడిస్తారు... ఏమయినా పామే.. అంతా యెడమెడంగా జరిగిపోతున్నారే?! జరిగిపోరా?

వొకటా.. రెండా పద్నాలుగుకేసులు!

బస్సు దహనం కేసు... టెలిఫోన్ ఎక్స్ఛేంజి పేల్చేసిన కేసు. పోలీసు ఠాణాపైపడి ఆయుధాలెత్తి కెళ్ళిన కేసు... సర్పంచి హత్య కేసు. ప్రజాకోర్టులో యిద్దరికి కాళ్ళేతులు తీసేసిన కేసు... నిషేధిత పార్టీలో సభ్యుడై వున్నందున కేసు... ఆయుధాలు కలిగున్నందుకు కేసు... ఆలోచనలు కలిగున్నందుకుకేసు...

కేసు పట్టని కేసులు!

సవాలక్ష కేసులు!

యివన్నీ వుంటేనే గదా జనజీవన ప్రవంతిలోంచే కాదు, ఆ భగవంతుడు (?) నుంచీ తప్పించుకోలేడు!?

శవమ్మీద కేసులా?!

శవమంటూ వుంది! దానికి ప్రాణమున్నా లేకపోయినా శరీరముంది!?... శరీరమంతా అక్కర్లేదు... వొక్క అవయవం దొరికితే చాలు అలియాసులు తగిలించి అరవైయ్యారు కేసులు అల్లేసి పెట్టడానికి! ఆనవాళ్ళే దొరకని అరంగుళం మాంసం ముద్ద దొరికి నా చాలు... అది నెత్తుటి గడ్డో... మట్టిబెడ్డో అయినా చాలు అదో కేసుల వోవు... వోవులకుప్ప!

శవమ్మీద సోరీ... గుర్రపు స్వారీ...

మూణ్నెళ్ళూ- ఆర్నెళ్ళూ- సంవత్సరము... మూడు కాలాలూ.. ఆరుఋతువులూ... వొక సంవత్సరము... కాళ్ళ కన్నా ముందు కీళ్ళరిగి పోతున్నాయి!

అన్నీ చిగురిస్తున్నాయి...

శవమో?!

ఏమో?!...

'నాసాకింద- మీసాకింద

నిన్ను జైల్ల బెట్టినారు

నీకూ నాకూ తేడాలేదయో- ఓ పోలీసన్న

పోరు దప్ప దారిలేదయో - ఓ పోలీసన్న...'

పోలీసన్న కోరస్ కావల్సొచ్చిందేం?!

సర్వేంటా? సరెండరయినందుకు వొచ్చిన ఇండెంటా?!

# 4

"రండి సార్........ రండి రండి....... రిటైర్ మెంటు సొత్తు తీసుకోవడానికూడా తీరిక లేనట్టుంది......" కలెక్టరాఫీసు క్లర్క్ మాట?

యెత్తి పొడుపా?

"మీ వయసు పాతికో.. యిరవయ్యారో... యెంతయితే యేంగానీ..."

"నగ్జల్బరీ శ్రీకాకుళ వసంత మేఘ గర్జనల్లో పుట్టాను..." అని యిన్నాళ్ళలా గొంతు పెగల్లేదు. పెగలకుండా ప్రతిసారి పెదాలు కుట్టుకు యస్పీముందూ కలెక్టరుముందూ అదేపనిగా నిరూపించుకున్నాడు. యిప్పుడు మాత్రం దారాలెలా తెగుతాయి? అవేమన్నా సంకెళ్ళా పుటుక్కున తెగిపడడానికి?! ఏడాదో యేడాదిన్నరో శీల పరీక్షలూ.. శల్య పరీక్షలూ... అందులో భాగంగా వైద్యమూ... వైద్యంలో భాగంగా వొకటి కాదు రెండుకాదు, స్థిరచర జమా బందీ లెక్కలన్నీ కలగలిపి ఐదు లక్షలు! ఎక్సుగ్రేసియా?! శవాలకే గదాయిచ్చేది?!

"మీ వయసుకు నీనింకా వుద్యోగంలో చేరలేదు..."

"చేరి పోరాదా? చేరిపిస్తాను... ఎపాయింట్ మెంటు తీసుకోనా?..."

"పిల్లలు గల వాణ్ని... వయసుడిగిన వాణ్ని..."

"ఏజ్ బార్ లేదు. ఎ.కె. ఫార్టీసెవెన్ యెక్కు పెట్టగలిగితే చాలు.. పెళ్ళాం బిడ్డలుండ కూడదన్న రూలేమీలేదు..."

'...యిస్సో... ష్ష్...' అని కిళ్ళీ వుయ్యాబోయి మింగి ".. గోడల మీద సున్నాలాయివి కావు, కర్ణభేరి పొరలు. అంచేత సేఫ్టీ సెన్సే కామన్ సెన్స్.. మరంచేత.. జోకులో కేకులో తరువాత కట్ చేసుకోవచ్చు. అందాక పీకలు జోలికి యెందుకు. కేసులింకా నడుస్తున్నాయి గదా.." ఆ ముఖం మరిచాన్నాళ్ళ దాక నవ్వదన్నట్టుంది.

'కేసులు తేలకుండా... అయిదు లక్షలు నా చేతిల పెడుతున్నారా?' అన్నానో... లేదో.. ఆయనా విన్నాడో లేదో...

అండర్ స్టాండింగ్ ప్రాసెస్ జరిగిపోతూవుంది...

....బంజరు స్థలం.. అందమీద 'డీ' పట్టా. బోర్లు తవ్వించి..షెడ్లు వేయించాక గొఱ్ఱె పిల్లల పెంపకం ... పథకం ప్రకారం పథకం!

గొఱ్ఱెలు పెంచడానికి ముందు తను పెద్ద గొఱ్ఱెకావాలి. గొర్రెల కాపలాకి ముందు తనో గొర్రె కావాలేః...

సబ్ కలెక్టరు సమక్షంలో యస్పీ పర్యవేక్షణలో యస్సై సియ్యై వందిమాగదులు వెంటరాగా... వార్తలందు జగము వర్ధిల్లగ... తెల్లటోపిని జేబులో వుంచుకున్న పసుపుచొక్క స్విచ్ ఆన్ చేసిందా? లేదో.. గాని.. వాళ్ళ చేతుల్లో స్విచెస్... తలొక చేతిలో కీస్...

త్వరలో డీ' పట్టా... అందాక సర్వే నెంబర్లు...!

భాగ్యం!

బ్యాంకులో తన పేర్న ఎకౌంటు!... అయినా ఎవరెవరు సంతకం పెడితే గాని చెల్లని చెక్... కంట్రోలింగు కోసమే కండిషన్స్...! ప్రాసెస్‌లో భాగంగానే ఇష్యూయింగ్... ఇష్యూతో సప్లై .. పంపకం.. సరఫరా.. కొనుగోలు.. అమ్మకం.. లాభం...

మాహాత్ భాగ్యం...!

నీళ్ళు చూపితేనే ఆనకట్ట గేట్లు ఎత్తుతారు. పనులు చూపితేనే పైసలూ... లేదా స్టోరేజీ! మీ ఆసక్తిని బట్టి మా శక్తి అందిస్తాం...

మహా మహా భాగ్యం...!

అన్నయ్యా మావయ్యా ముందు వెనకలుండి, కుర్రాడికి మంచీ చెడ్డా తెలియదని, మారిన (?) లోకం అర్థంకాదని... అడివి(?) మనిషినని అన్నీ అకౌంటు లేకుండానే ఖర్చుపెట్టి- అందుకు అప్పు తెచ్చి మరీ గౌరవించుకున్నారు. ఎవ్వరి ఋణమూ మా కొద్దని తృణమూ పణమూ యిచ్చుకున్నారు.. మన్ననా మర్యాద దక్కించుకున్నారు! గ్రాంటుకే యింత గౌరవమిచ్చుకున్నారు. ముంజూరయితే ముంజూర్లు తడిపేస్తారే?!

మళ్ళీ.. మళ్ళీ నేను గాంధీ గారి మూడు కోతులు కలగలపిన వొకే కోతినయ్యాను! వొత్తొత్తి కోతినేనా?

'కీ' లున్నాయి గదా... యిస్తే... కీయిస్తే...

ఆపరేషనెప్పుడో మొదలయ్యింది.. ఆడుతోందా వూపిరి..?!

*"ఓ నా ప్రియమైన మాతృదేశమా*
*తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా*
*దుండగులతో పక్క మీద కులుకుతున్న శీలం నీది*
*అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది*
*సంపన్నుల చేతుల్లో మై మరచి నిద్రిస్తున్న యవ్వనం నీది*
*ఊసినా దుమ్మెత్తి పోసినా చలనంలేని మైకం నీది..."*

తల్లిమైకమే... బిడ్డదీ?!

ఆ మైకం కోసమే మామయ్యా అన్నయ్యా మందు కొట్టారు. తనొద్దన్నాడు.. తనకొద్దన్నాడు. మైకమేనాదో కమ్మేసింది... జీవితానికి సరిపడా?

మత్తులో లేదూ?! గమ్మత్తైన మత్తులోలేదూ?!

## 5

యిదొక డెన్నే!... గుహే..! కాదు,జైలే జైలుగదే...!

యెన్నెన్ని జైలు గదులు?!... యిల్లొక జైలు గది! కోర్టొక జైలు గది! పోలీసు స్టేషనొక జైలుగది! చివరకు గొర్రె పిల్లల పెంపకం కోసం వేసిన షెల్టరొక జైలు గది! వాటికీ(?) నాకూ జైలు గది ! ఈ ప్రపంచమొక జైలుగది!...

వేదాంతం వొంటికీ పట్టిందీ!?

వున్న గదంతా చీకటిగా వుంది! అవతలి గదీ... ఆకాశమూ చీకటిగా వుంది! తనబతుకులాగే!

ఎప్పటికీ తెలతెలకువ కాని చీకటి...

'ఆకాశానికి చీకటి ఎన్నటికీ అలంకారంగా మారలేదు

మిలమిల మెరిసే చుక్కలే తోరణాలు!

చంద్రుడే కిరీటధారి!!

వెన్నెలని ఎవ్వరూ గ్యారంటీ కార్డు అడగరు

భీకర తుపాన్లు సముద్రానికి కొత్తకాదు...

ఒడ్డుకు పడే మృతజీవాలు 'అత్యల్పం....-'

'అల్పజీవి' నంటున్నాడా వొక్క క్షణమైనా కాగడాగా వెలిగిన ఎం.ఎస్.ఆర్..

అల్పజీవినే!

నాకలుగెక్కడ? యిదే నా కలుగు! నా కలుగులోకి నేను దూరిపోతాను.. దాగిపోతాను...! కిచ.. కిచ.. కిచా.. కిచా.. మిగతా యెలుకల చప్పుడు...

చెవులు రిక్కిస్తిని కదా...?!

'... ఎండుకడుపోడు యేదుం తింతే, నందకడుపోడు నిందమోసి పొండని... సెయ్యని తప్పుకు నామీద నిందలెత్తండి నీనేటికి ఆడికి అడివిల పట్టిపొమ్మన్నానా? కాదురబాబు రమ్మన్నానా? యెవుల బతుకుల గాని - ఆల ఆసలగాని- వేలు కాదు కాలు కాదు గోలు పెట్టలే. అదిగో ఆపిల్ల... ఎవర్తో కాదు... నాసెల్లెలు దనికి అమ్మా అయ్యా లేపోవచ్చును. నీనింకా బతికే వున్నాను. నాబొందిల యింక పేనం వుండనేవుంది... అలాటిది నా సెల్లెలు నాతోడి కోడలవుతాదంటే యానికి వద్దంటన్నానో వొకరవ్వ ఆలోసించండి...'

వదిన వాదిస్తోందా? వాపోతోందా?

'పిల్లడికేటి కాలొంకే... కన్నొంకే..' ముసలితల్లి వొప్పదు. కయ్యమేనా?!..

"కాలొంకో కన్నొంకో అయితే బాధలేదు... బందిరీ లేదు... కడుపొంక.! కడుపొంకోడు నాసెల్లిలికేటి కూకో బెట్టి కూడేసేత్తాడు?'

వదిన వకల్తాదారే, 'స్వరం' వినపడదేం?!...

అన్నయ్య మాట్లాడడేం?!

"... అది కాదమ్మా కేసులని పోలీసులనీ నువ్వు బయపడతన్నావు నిజమే. మన కుటంబంల అలాటివి లేవు, కాని ప్రపంచంల అవన్నీ వున్నాయి. ఏరోజో వొక రోజు... యెవులింటికయినా నిప్పంటు కోకపోదు. యివాల మనింటికి... మనింటి ముంజూరుకే అగ్గి అంటుకుంది.. యింతమంది మున్నాము వొగ్గేస్తామా?... " మావయ్య మాట పూర్తిగా కానివ్వలేదు.

''లేదు... బతుక్కి యిదే యాపకం...'' వదినది ఆగ్రహమే... సహనం లేనితనం కాదు...

''పద్నాలుగు కేసులకి.. రెండేకేసులుంచినారు. ఆలిచ్చినవి తీసుకున్నాక ఆడిమీద నీకింక అనుమాన మేటి?... వొదిలీసెలిపోతాడూ?...'' మళ్ళీ మామయ్యగొంతు.

యిక్కడ గుటకలు పడ్డాయి!?

''...లేదు... యెళ్ళడని నువ్వు రాసిత్తావా? సిన్నాయినా.. వొక పేగు యెరుసయిపోయిందని ఆ కబుర్లు నాకాడ ఆడకు. నీ కూతుర్నిగానిత్తావా?''

అఖరి బాంబు పేలిపోయినట్టేవుంది.

ఎక్కడి దొంగలు అక్కడె గప్ చిప్!

నేనూ గప్... చిప్....!

ఎడతెగని రాత్రి... ఈదలేనిరాత్రి...

కిచ.. కిచా... కిచ... కిచా... చిట్టెలుక?!

ఎవరది? యెవరిదా స్వరం? స్వరం దేనా?

'బావాఁ..'

కాలేజీలనాటి అమ్మాయిల అందమైన గుంపు. ఏమిటీ ముంపు' అని తను తప్పుకు తిరిగాడు. ఆంజనేయుడన్నారా? కొంతమంది కృష్ణుడనీ అనలేదూ?!

'బావా.. నువ్వంటె యిష్టం..'

'యిష్టమంటే?'

'తెలీదు.. యిష్టమే!'

'టీనేజ్ కబుర్లొద్దు...'

'యే యేజ్‌లోనైనా ఓకటే మాట...'

'నాకూ ఒకే బాణం, నాతో అడవులు పట్టిపోతావా?'

'అజ్ఞాత వాసం అయిపోయిందిగా, యిక పట్టాభిషేకమే!'

'మరి కట్నం?'

'నీకెవడిస్తాడు? కట్నం.. నీ కెవరిస్తారు పిల్లని...'- 'నీనుండగ' 'కుంజరహా' అయింది. తను 'హతహాఁ' అయ్యాడు. యెక్కడో మందుపాతర పేలబోయి, తప్పింది సర్దుకున్నాడు.

ప్రేమా?

అంటే

'వొక గుప్పెడు వేరుశనగ పలుకులో.. వొక కప్పుడు కాఫీయో పంచుకోవడం కాదు, వొక కంచంలో తినడం వొకే మంచంలో పడుకోవడమో అంతకన్నా కాదు. ఒక ఆశయాన్ని ప్రేమించడమే

ప్రేమ. ఆ ఆశయం కోసం యిద్దరూ కలిసి నడవడం ప్రేమ...' భాస్కరు యిక్కడా వెంటాడుతున్నాడే, వేటాడుతున్నాడే!?

మరితన కొక ఆశయముందా? 'స్వరం'లో ఆ ఆశయం వెదుక్కోవడానికి?!

## 6

తలక్రింద తలగడలా పుస్తకం తనే రాసిన కథల పుస్తకం.. తలెత్తడంతో ఆ అక్షరాలన్నీ పుస్తకంలోకి రాలిపోయినట్టు వొట్టిదైపోయిన తల. అందుకే నేమో మూడేళ్ళయి బయటకొచ్చి ఒక్క కథా పుట్టలేదు?!...

చావు వెంట తరము కొస్తున్నప్పుడు చేతివేళ్ళు పట్టిన చిత్రిక... సృజనా... యిప్పుడిలా బతుకు వెంటపడ్డప్పుడు వేళ్ళూ మనసూ బండబారిపోయిందే?! అప్పుడొకటే చావు... యిపుడంతా చావేః..

'అక్షరం రాయాలంటే

కలం తలక్రిందులు కావాలి...

మరి కొత్త చరిత్ర రాయడానికి

మనిషి మరెంత తలక్రిందులు కావాలి...?!'

భాస్కరుడు నన్నొదలడు!

వొదిలించుకోవడానికా? కావలించు కోవడానికే కదా?! కొనవూపిరి నైనా కొనసాగించడానికే కదా ప్రజా సంఘాలతో కలిసి నడవాలనున్నాడు. స్వచ్ఛంద సంస్థల ముళ్ళ కంపలతో కాపలా కాయలేడు.

ఆత్మచుట్టూరా అంటు కట్టుకుంటున్నాడు. అంటరాని వాడై పోతున్నాడు!

"అమ్మోరి గుడికైతే ఎలగా రాబోవు, తప్పుకాయి తల్లీ' అని నీనే యే నీల్దారో తీసినాను... అదేట్రా తిరపతి యెంకన్న మొక్కూ కాదనిస్తే యెలగ? నువ్వు బయిటికొస్తే నాతల నీలాలూ నీ తలనీలాలు యిస్తానని మొక్కుకున్నానురా..."

తనక్కాదనే వూరుకున్నాడు.

అమ్మలో పాత భయాలూ ఆందోళనలూ మళ్ళీ చోటు చేసుకుంటున్నాయా? అప్పుడు ఆరేళ్ళలో మూడేళ్ళకు కనబడక కనబడితే కదిలిపోయినట్టు కదిలిపోతోందేమిటి?

అమ్మ దుఃఖానికో పాయ... రాగంతీసిన యేడుపు! యిప్పుడు రాగంలేదు. దుఃఖముంది. తలపట్టుకు కూర్చుంటుంది. తనేమి మాట్లాడగలడు? యేమి మాట్లాడినా యిన్నాళ్ళు మూసుకు పోయినట్టున్న కన్నీటి రంధ్రాలు తెరచుకొని జలజలా వూరుతాయి. తట్టుకోవడం తనకీ వల్ల కాదు.

అందుకే ఆగర్భశత్రువుల్లా యిద్దరి మధ్యామాటలుండవు. వొకర్ని చూస్తే మరొకరికి సంకేతాలర్ధమయినట్టు సర్దుకుపోతారు.

యిప్పుడూ యిక్కడా అలానే సర్దుకున్నట్టేవుంది. అమ్మ మరొక్క మాట మాట్లాడలేదు. వదిన యెవరితోనో యెందుకో అంటున్న పాడుపు 'గులిబింద గింజ దాని గుద్దకింద మచ్చ సూసుకోకుండా,

నాయింత సాయ యెపులూ లేరన్నాదట..' దెప్పి పొడుపులా అమ్మని తాకినట్టేవుంది. విలవిలలాడ్డం తెలుస్తూనేవుంది. 'యేనుగెలిపోతుంతే యెయికుక్కలరుత్తాయి, దాని యీక రాల్చాదే, యెనకెల్లి ముడ్డి రాసియ్యాల' అమ్మ గోడకుకాదు, గొణుగుతున్నట్టు తన్ను వోదార్చుతోందా?

యెప్పుడైనా అమ్మని దగ్గరికి తీసుకొని 'నాయమ్మా' అని తనివితీరా యేడాలని ముద్దులాడాలని వుంటుంది. దగ్గరికి తీసుకోవాలనీ వుంటుంది.

యీ పిరికి వాడికి అంత ధైర్యం లేదు!...

''అమ్మా బాపున్నాడా... 'సినబాప్?'..?''

అని పూర్తి వాక్యపరి అలవాటుగా అడుగుతున్నప్పుడు... తను అరుగెక్కి ఆలు చెప్పిన విషయం విని- విప్పి చెప్పి- తగువు తేల్చి బోధ పరిచినప్పుడు.. అమ్మ నుదిటిమీది గీతలు యెటు మాయమైపోతాయో?! తన చూపులో చూపుపడనీకుండా రెప్ప ఆర్పకుండా అమ్మ పసిపిల్లయి పోయి నోరెళ్ళబెడుతుంది...

''వాడ్ని నువ్వేపొడు చేసినావ్...' అన్నయ్యే కాదు, దగ్గరగా యెరిగిన వాళ్ళంటే అమ్మ నవ్వేస్తుందే కాని తగువుకి దిగదు. వొక్కమాట వోదించదు!

అలాంటి అమ్మ కలకలంగా కలవరంగా అవుపిస్తోందే?!...

''మళ్ళీ మీ వోడు ఆ నచ్చలైట్లుని కలుత్తండు... మనోడే గదా అనీసిసెప్పతన్నాను. యింకోలైతేసెప్పను. యస్పై గోరూ సియ్యైగోరు అనుకుంతే ఆలించి సెప్పతన్నాను... పాతిక ముప్పైయేల కొడుకు.. మరి సెయ్యి జారితే సంపాదించగలవా? వొకపాలంతే అది నువ్వు సేసుకున్న పుణ్యెం.. గుండాన పడిన కొడుకు దక్కినాడు... ఈ దపా యేటైతే కష్టం... మరి సూడవు మొన్న యిసాక పట్నం యెళ్ళి నాడు గదా.. ఆలజట్టోలున్నారు, ఆలని కలడాకే యెళ్ళినాడు. నాకర్ల. సెప్పడానికి యిందలేట్లేదు. ఆలోసిత్తే అందల బోలెండుంది''... పక్కింటి ముసిల్ది.. అదే గదా తనికి పడుచునేస్తం... అది 'అమ్మకి పోలీసోడు సెప్పగా ఆలించినానని యిదిరానాయినా మనపడా' రాత్రే చెవిలో వేసింది.

అందుకేనేమో... ''ఆలకతలు ఈలకతలు వూరోల కతలు నీకేల? నీకతేదో నువ్వు సూడరాదా?!'' అని వొక్క మాట అనగలిగింది అమ్మ.

తలెత్తి చూసాడు తను...

అమ్మక్కడలేదు... రాని నడ్డిని ఈడుస్తూ... బతుకు బరువుని మోసుకు పోతున్నట్టు అక్కణ్నుంచి కదిలిపోతోంది.

ఏ బరువునీ యెత్తుకోని తను యెటూ కదలడేం? కదలలేడేం?!

## 7

'అన్నోరన్నోరన్నో...

అప్పలకొండో కొండో...

నాయ్డు బావో బావో.. నాయుడు బావో-బావో’...

గుమ్మా వర్షాలు గురిసి

నాట్లకి సందడి జూడు...’

నాలుకపై నర్తించేపాటకు ... డబ్బాల్లో గులకరాళ్ళు గుమ్మరించిన శబ్దం తోడై- కమ్మని పాటని తుత్తినియలు చేసింది.

నలుగురైదుగరు వొక గుంపుగా ఆరేడు బ్యాచీల వాళ్ళొచ్చారు. పొద్దున్నే వొచ్చి అది చెరువు గట్టైనా కాపుకాసే పట్టుకున్నారు. పిల్లలనుండి పెద్దవాళ్ళ వరకూ వున్నారు.

“యినాయక సవితి.. సెందా... డెబ్బీలయెయ్యి...”

‘నాదాంట్ల ముందలెయ్యి..’

‘మాదాంట్ల ముందలెయ్యి..’

‘యిన్ని డబ్బాలేటట్రా?...’ అనేనా తనడిగాడు.

‘ఇది మాయెలమీదిది’; ‘యిది మాసాకలీద్ది’; ‘యిది మా పొందరీదిది’; ‘యిది సాలీదిది; ‘యిది మారెల్లీదిది’, ‘యిది మన నాయుళ్ళది..’

కులపోరాటాలా? జాతులపోరాటాలా?

ఏమనాలో తెలీక ‘అందరూ కలిసి వొకే పెద్ద వినాయకున్ని పెట్టుకోవచ్చుగదరా?’ అన్నాడు. అంతేనా? అందరూ పిచ్చివాణ్ని చూసినట్టు చూసారా? చూడరూ...

‘తెలుగు దేశం వినాయికుడు’

‘కాంగ్రెస్ వినాయికుడు’

‘బీజేపి వినాయికుడు’

చివరాఖరికి పార్టీల (వి) నాయకులే మిగిలారు!

‘యిజీనారం’లో అటువంటి పోటికి ఫస్టట. వుత్తరాంధ్ర కాదు, వోలాంధ్ర పనికి రాదు. పర్మినెంటు నాయకులు... సారీ... వినాయకులు...

అవునూ, తనూ కోర్టులకి హాజరయినపుడు చూసాడు.

యింకా కొత్త కొత్తవి వూళ్ళోనే వింతగా చూస్తున్నాడు. నిజమే, అడవులు పట్టి పోయిన తాను ఆధునిక సమాజమేం చూసాడు?

దేవీ నవరాత్రులూ... దసరా పండుగ.... దీపావళీ...

పండగల ప్రవాహమే... తెరిపిలేదు... సిక్స్‌టీన్ ఎమ్మెమ్మ్ సినిమాలతో వూరంతా బురద బురద. జబును జబును. టీవీలు పెట్టి వీసీపిలు తగిలించి వీధుల్లో కొత్త కొత్త సినిమాల ప్రదర్శన కారుచౌక వినోదం...

హరికథలూ... బుర్ర కథలూ... వొగ్గుకథలూ... జముకుపాటలసలేలేవు...

రికార్డింగు డాన్సులు తగ్గాయనుకున్నంటే... వంగపండు భూమి భాగోతాలు అసలేలేవు.

నీటి ముళ్ళూ... మొకర... పరిపండూ... మిత్తమ్మా ప్రసాదో.... నేస్తరికాల చుట్టరికాల బంధుత్వాలేమయిపోయాయి?

ఏటి బట్టికాడ పిత్తపరిగిలు కొత్త నీటి కెక్కినట్టు సీజన్‌కే కాదు... యెప్పుడూ యెడ తెగని వలసలు... మూటాముళ్ళీ... నెత్తిన బతుకు తట్ట... దించలేక.. ఎత్తుకు నడలేక యెక్కడికో? యే వూరికి రోడ్డుందో ఆవూరికి బస్సు వుందో లేదో గాని వలసిగట్టిన వరసలు వరసలుగా జనం....

జాతరా.. పరసా... వచ్చీపోయే జనం...

ఎవరెవరో ఎటుకటు తప్పిపోతున్నట్టున్నారేఁ.. అరరేఁ...

తనూ దారి' తప్పి పోలేదూ?!

'ఈగట్టున తోవ లేదయ్యా' ఎవరో వూరిజనమే గుర్తు చేస్తున్నారు.

నిజమే, తను జనజీవన స్రవంతిలో' కలవాలి!

'అతగాడు వూరి తగువులు తీర్చడాకే గానీ.... యీలాటి వూరి సంబరాలకీ సరదాలకీ సరిపోడు.... అతగాణ్నేల యిబ్బంది పెట్టడం... అతగాడు.. కమీనిష్టు...'

తేల్చేసారు, తీర్పిచ్చేసారు?

యిక్కడ కమీనిష్టంటే అన్నలనేగదా, మిగతా కమీనిష్టు పార్టీలంటే వోట్లలో పాల్గొన్నవాటికి తెలుగు దేశం కమీనిష్టు, కాంగిరేసు కమినిష్టని పలుకుతున్నారే... జనాలెంత తెలివి మీదున్నారు. తననింకా వ్యక్తిగా కాదు శక్తిగా కాదు పార్టీగానే చూస్తున్నారే...?!

తనని తనలా చూసుకోగలడా? మరి తనని తనలా గుండెమీద చెయ్యివేసుకు చెప్పగలడా?

## 8

అలవరసలుగా బాద్రపదం, ఆశ్వీజం అలాగెళ్ళాక కార్తీకం యిలా గొచ్చింది. వూరంతా దీపతోరణం! ఆడపిల్లలదే అంతా అన్నట్టుగా కొత్తగా పయిసు తెచ్చిన రంగురంగుల పూల రెక్కలు.... సీతాకోక చిలుకల్లాగ యెగురుతూ.... తుళ్ళుతూ...

వొక సీతాకోక చిలుక పొద్దుట్నుంచీ నాగది ద్వారం దగ్గరే తచ్చాడుతున్నట్టే వుంది. తను కూడా చూసి కూడా చూడనట్టేవున్నాడు.

'స్వరం' వినిపించింది!

మరో అపస్వరం (?) నన్ను బయటకు లాక్కెళ్ళింది...

కార్తీక మాసం... వీధితోటి... వాడతోటి... గుంపులు గుంపులుగా...

ఇంటితో (అమ్మ తప్పించి, యిల్లు కాపలాయా? ఏమో.. యెక్కడికీ రాదు?!) బయిల్దేరాక వుండడం వుండక పోవడం తన చేతుల్లో లేకపోయింది. అడుగులలగే పడ్డాయి. అరకో... అనంతగిరో... తోటపల్లో... అడగలేదు...

కాకులు దూరని కారడవులూ చీమలు దూరని చిట్టడవులూ అమ్మ చెప్పిన కథల్లోనే కాదు, అమాంతం యెళ్ళి చూసొచ్చాడు. పచ్చటి పసిరిక పాములా సంచరించాడు. సంచలించాడు. (ఆ సంచలనాలేనా ఈ తలపులు) గరిక పూసల గతం చేసే గవ్వల శబ్దం... పచ్చని చెట్లమీది ప్రతి ఆకూ పలుకరిస్తున్నట్టు వెన్నంటే మువ్వలశబ్దం...

యెటొచ్చీ లోపల పత్రహరితం కాలిపోయి లోపల కవురుకంపు సుడులు తిప్పతోంది. యెండిన మానులు సగం కాలిన శవంలా ఎముకలు విరిగి బూడిదవుతున్నట్లు... ఆ బూడిద గాలికి కొట్టుకు పోతున్నట్టు తన నడకా...

'మన నాయుళ్ళ లాగ... యెవులూ పికినిక్ చెయ్యలేరు..'

'వూరి మొత్తానికి మనదే గ్రాండ్...'

"తిన్నంత తినొచ్చు... తాగాల్సినంత తాగొచ్చు..."

"అంతేనా మరి మిగతావి?'

'సిక్రెట్టూ సెన్నారూ...'

చిన్నప్పటి సహవాసగాళ్ళ... యెప్పటికీ తనని వదులుకోనివాళ్ళు ... మధ్యలో వదిలి వెళ్ళి మళ్ళీ వచ్చి చేరిన వాళ్ళు... యిప్పటికీ తన నీడను చూసి భయపడ్డ వాళ్ళు... పెళ్ళిళ్ళయిన వాళ్ళూ కాని వాళ్ళూ...

ఆడామగా వేరువేరు ఆటలుగా విడిపోయిన వాళ్ళు...

సిగరెట్ చేతివేళ్ళకందింది... లోపలిపొగ పైకి చిమ్ముతున్నట్టు నాముక్కురంధ్రాలు పొగగొట్టాలేఁ...

లేతలేత గుంటలు క్రికెట్టు ఆడుతున్నారు.

వొదినా స్వరం వంటల దగ్గరున్నారు. అన్నయ్యా మరికొందరు పొయ్యి దగ్గర కూర్చొని బాతాఖానీ కొడుతున్నారు. స్వరం కళ్ళు అప్పుడప్పుడూ తనని వెదుకు లాడుతూ చుట్టు ముట్టే ప్రయత్నం చేస్తున్నాయి.

పేకాట సిట్టింగుకు దుప్పటి పరిచారెవరో... అప్పుడే ఆట మొదలయి పోయింది కూడా. తన ముందూ ముక్కలొచ్చి పడ్డాయి. అనాసక్తంగా అందుకున్నాడు. ఎవరో ఆడిస్తున్నట్టు వెనుకనుండి మరెవరో తనని సర్దుతున్నారు. కార్డుముక్కలు మాత్రం చేతివేళ్ళ మధ్య తనలాగే చేతనం లేకుండా...

మాటలు మొదలయ్యాయి...

సారా నిషేధించాక వొచ్చిన రొయ్యల చెరువులు. రొయ్యల చెరువులు కాలుష్యమని నష్టాలొచ్చాయని... కోర్టులో వీధిగుమ్మాలో యెక్కాక అట్నుంచి చిన్న చిన్న రెసిడెన్షియల్ కాలేజీల

వ్యాపారాలూ... ఎమ్‌సెట్ కోచింగులూ... కంప్యూటర్ రంగమొచ్చి దాన్ని కొల్లగొట్టాక ఇన్ఫరమేషన్ టెక్నాలజీ... సమాచార విప్లవం... సాంకేతిక వుద్యమం... వెబ్‌సైట్ల పేరాచూట్లు...

వాళ్ళ వాళ్ళ వృత్తులనుండి పూర్లోకి యిళ్ళలోకి వొచ్చిన టెలీకాన్ఫిరెన్సులు... వీడియో కాన్ఫిరెన్సులు...

వ్యాపారాల నుండి... వ్యవసాయలనుండి... వృత్తులనుండి... వుద్యోగాలనుండి...

వాళ్ళంతా మాట్లాడుతున్నారు.

సమాచార విప్లవం ముదు... సాంకేతిక వుద్యమం ముందు... తనేంమాట్లాడగలడు. కుల పోరాటాల ముందు... తను వృత్తి విప్లవకారుణ్ని యెలా చెప్పుకోగలడు? అర్థాలూ జీవిత పరమార్థాలూ మారిపోతున్న దశలో.. తనూ దారితప్పినదశలో... కార్డులో చూసుకుంటే అద్దంలో తన ప్రతిబింబంలా జోకర్!

ఆడుతున్న ఆటలోకూడా 'మధ్యలో' లేచాడు.

భోజనాలు.. కుల పంక్తి భోజనాలు... పరసలూ... గోత్రాలూ.... పెళ్ళిళ్ళూ... వుద్యోగాలూ.... ఆస్తులూ... కులపోరాటాలు ఆత్మగౌరవ పోరాటల దశదాటి కులబల సంఘాలుగానా?!

తను మాట్లాడని తనమీ్మద యికటాలాడుతున్నారు.

తనకి యేడ్పూరాదు, నవ్వేందుకు ప్రయత్నించాడు...

'నాయుడూ త్రయిం' అన్చెప్పి అచ్చయిన రచనా వ్యాసం పట్టుకొచ్చి వొకడు నన్ను అక్కున చేర్చుకున్నాడు. మీరు ముగ్గురే రాస్తున్నది..... భూషణం మాష్టారి తర్వాత...

నిజమే కావచ్చు, 'శీర్షిక'కూ అంటుకున్న చిచ్చు... కార్చిచ్చులా దహిస్తోంది... అగ్నికి ఆజ్యం పోస్తున్నట్టు కులం వడ్డనల పికినిక్కూ... ముడ్డికి అంటుకున్న పీట మొయ్యాల్సిందే... తనొదిలినా... వదలకుండా మోసుకొచ్చే గోత్ర సంబంధీకులు...!

"ఏకులమబ్బీ

మాదేమతమబ్బీ..

పశులను చంపి మీకు చెప్పులు కుట్టిచ్చునపుడు

కూటికింత కూడులేక కుండలు జేసిచ్చినపుడు

సన్యాసులై వొస్తే క్షవరాలూ చేసినపుడు

మురికి గుడ్డలుతికి మల్లెపూలు చేసిచ్చినపుడు...- ఏకులమబ్బీ మాదేమతమబ్బీ" అని చెరబండరాజు చెర' వదలదేం?!

మందు మంత్రంలా పెదవులు దాటని వుచ్ఛారణతో మగపూజారుల నాలుకల్ని తడుపుతోంది..

తను తాగినందుకుకాక తాగనందుకే అన్నయ్యా మావయ్యా అంతా ఆశ్చర్యపోతున్నారే.. అనుమానిస్తున్నారే..

వీడు మారలేదు... కష్టం.. జాగర్త!

నిజమే!, జన జీవన స్రవంతిలో కలియలేదూ?!

.... పోక ముందు కళ్ళుకుండ యెత్తేసేవాడివి?!

... యిప్పుడు చాలా యెత్తుకోలేకుండా వున్నాను! -నాభాష అర్థంకానట్టే వుంది వాళ్ళకి!

వీడికి వొకటే మందు....

పెళ్ళికాని పిల్లలకిచ్చే మందు....

....పందెం... పందెం... మిత్రులు కాసుకున్నారు.

ఆరాత్రి వూర్లోనే యేర్పాటు... మంచి సరుకు జబ్బులేవీ రావట.. ఫ్రెష్ బండట. వాడమంటున్నారు. వాడాక వొదిలేస్తే తాము వాడుకుంటారట.

తనకే జబ్బన్నాడు.

అర్థం కాలేదేమో నోరెళ్ళ బెట్టారు. నవ్వేసి కొట్టిపారేసారు, యిలాటివి అలాగే పోవాలి, పోతాయి అనుభవమ్మీద చెపుతున్నామన్నారు. ప్రోత్సాహమిచ్చారు. అనుమానంతో అవమాన పరిచారు. 'నీకు లేదా?' రెచ్చగొట్టారు.

ఈ కబుర్లన్నీ యెవరెవరికో యెలగెలగో తెలుస్తున్నట్టున్నాయి. వాసన పసిగట్టడం తల్లికడుపులో వుండగనే నేర్చుకున్నాడు.

యింటి వాళ్ళు రికార్డు చేసుకున్నారు!

పోలీసు వాళ్ళు రికార్డు రాసుకున్నారు!!

'చెప్పలేదా వాడు పార్టీ పనుల మీదే బయిటికొచ్చాడు' నిర్ధారణ చేసుకుంటున్నారు! అదే నిజమైతే యెంత బావుణ్ను.!? ఆ నిజాన్ని నెత్తికెత్తుకోగల సత్తా తనకింకావుందా?

## 9

'ఈ విప్లవాగ్నులు ఎచటవని అడిగితే

శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి!.-

నిజమే తను చూసాడు. తన పడుచునేస్తం... అదే పక్కింటి ముసల్ది కొంత వరకూ కాదు, చాలా వరకు వ్యక్త పరచగలిగింది. చూసింది చెప్పగలిగింది. తనుచెప్పలేడు. తనకంతా వుక్కిరి బిక్కిరిగా వుంది.

'నా చిన్నప్పుడు కాసి మన రాజ్జిం... మన రాజ్జిం... అదిగోమన రాజ్జిం... ఇదిగో మన రాజ్జి మన్నారు... ఏదీ యెప్పుడూ రాలేదు.

గానేటంతే-

ఇపుడికి మాత్రం పావలా వాటా వొచ్చినట్టుగనిపించింది'

తన 'యాతర'లో అవి ముగింపు వాక్యాలుగా కథకుడెవరో కథ చెప్పివుండొచ్చు, కాని అవే పునర్జన్మంటూ వుంటే తనకి ప్రారంభవాక్యాలు!

నిజం... అవాళ అందివొచ్చిన వూపిరి మరికొన్నాళ్ళు తన్ను బతక నిస్తుందని పించింది.

నీడలు నీడలుగా జాడలు జాడలుగా వున్న తను 'రోడ్డెక్కాడు!'

ఎక్కకుండా ఎలా వుండగలడు?

ఊక బోత్తే వూక రాల్దు! ఇసక బోత్తే యిసకరాల్దు! స్థూపం చూస్తే కళ్ళుగిర్రున తిరుగుతాయి. కళ్ళలో నీళ్ళూ తిరుగుతాయి. యెలాంటిదది? యెవరెవరిదది? యెందరెందరిదది?

'తూం మీద అడ్డ, అడ్డ మీద తవ్వ, తవ్వమీద సోల, సోల మీద గిద్ది, గిద్ది మీద సుత్తీకొడవలి... పేరుపులు పేరుసుకోని ఆకాశానికి అంటిపోయింది..' మా పడుచు ముసల్ది కామెంటరీ యిస్తోంది..

సత్యం, కైలాసం, పంచాది క్రిష్ణమూర్తి, నిర్మల, సరస్వతి, అంకమ్మ, పాణిగ్రహి ఒకరేమిటి? మూడునాలుగు వందలమందిని స్మరింపజేసే జ్ఞాపకాలజెండా... లేవిడి... స్థూపావిష్కరణ... తననేశక్తి నడిపించిందో తనకే తెలియదు...

అక్కడుండి తనూ కొన్ని పనులు పంచుకోగలిగాడు. స్థూపంలో వొక యిటుకంతో... యిసుక రేణువంతో యింతో అయి తనూ పంచుకోగలిగాడు... తను పుట్టిన సంవత్సరాలనాటి కాలంకొల మానమ్మీద... ఆలేవిడి భూమ్మీద మొట్టమొదటి సారిగా భూస్వాములు కోరన్ననూ మంగన్ననూ చంపిన చోట...

ఊరేగింపు...

ఇవతల లేవిడికి... అవతల గుమ్మలక్ష్మీపురంకీ పరుచుకుంది. హిరణ్యాక్షుడు భూమిని చుట్టగలిగాడేమో గాని పోలీసులు, ఈజనాన్ని చుట్టలేరు. వాళ్ళ గైనేర్లనేళ్ళా కాదు, గడ్డికుప్పలవల్లా కాదు.

పోలీసులు లారీలూ బస్సులూ యెక్కడివక్కడ ఆపేస్తున్నారు.

జనాలు రాళ్ళు కారు. రప్పలు కారు. ఆపిన చోట ఆగడానికి... దించినచోట వుండడానికి... జనం... నీరు!... ఎత్తు పల్లాల్ని సరిచేసుకుంటూ పోతారు. జనం.. నిప్పు..! దహించు కుంటూ పోతారు. జనం... గాలి! అంతటా కలిసే పోతారు!

ఐడీ పార్టీ వాళ్ళు తననే చూస్తున్నారా, చూడనీ!

మా ముసలిపడుచు కూడా కామెంటరీ ఆపదే... కలియుగ వైకుంఠమంటోందే!

'... మనిషి సమూహంలో ఆనందిస్తాడు

మనిషి సమూహంలో ఆగ్రహిస్తాడు

మనిషి

సామూహిక ఆగ్రహమే ఉద్యమం

మనిషి ప్రవహిస్తాడు పర్వతోన్నతుడౌతాడు

మనిషంత విలువైన వస్తువు- మనిషే

మనిషంత విషతుల్యమైన వస్తువూ - మనిషే...'-

కవి శివారెడ్డి అన్నట్టుగా తనిప్పుడు ఒంటరికాడు. ఏదో తెలియని బలమొచ్చి చేరుతోంది. నిస్సత్తువ నిశ్శబ్దంగా జారిపోతోంది.

తను కరచాలనమయ్యాడు.

కరపత్రమయ్యాడు.

నినాదమయ్యాడు.

రాలీ అయ్యాడు.

అన్నిటికన్నా ముందు ఆ స్థూపానికి రాళ్ళెత్తిన కూలీ అయాడు. పనులు బెత్తాయింపులూ పురమాయింపులూ కాదు అదే 'పని'గా వున్నాడు.

తనమీద రిపోర్టులు వెళ్తున్నాయట... వెళ్ళనీ!

మిగతా రెండుకేసులూ యెప్పటికీ కొట్టరట... మానుకుంటే మాత్రం కొడతారూ? జీవితాంతం మోయదలచుకున్న కళ్ళాలు కావు అవీ?!

'మాట్లాడే హక్కుని కూడా మనం అడుక్కోవద్దు-

గాలంత సహజంగా, స్వేచ్ఛగా నిర్భయంగా మనం మాట్లాడదాం..

గాలంత ప్రాణంగా అపరిమితంగానూ బలంగానూ మనం మాట్లాడదాం...'

మాట్లాడు. వూఁ... మాట్లాడు.. వేగిరపరుస్తున్నాడు కవి. త్వరిత పరుస్తున్నాడుకవి. తీవ్ర పరుస్తున్నాడు కవి. ఆగ్రహపరుస్తున్నాడు కవి.

యిన్నాళ్ళూ తెగిపోయిందనుకున్న నాలుకని... నేలన పడి మట్టిలో పొర్లి పునీతమైన నాలుకని... తిరిగి అరచేతుల్లో పట్టి అంగుట్లో వేసుకు మరీ మాట్లాడు...

వూఁ.. మాట్లాడు! మాట్లాడు!?

# 10

మాట్లాడు!

మాట్లాడవేం?

నిన్నేరా మాట్లాడవేం? వాళ్ళకేం పోయిందిరా. నరాల్లేని నాలుకని ఎలాగైనా తిప్పుతారు. యెన్ని విన్యాసాలైనా చేయిస్తారు. వుపన్యాసాలు దంచి... పాటలుపాడి... ఆడి... ఆడించి వెళ్ళిపోతారు. యివాల్టి నుంచి యిక్కడ బతకాల్సింది మనం. బండిలాగాల్సిందిమనం. దాని కష్టం నష్టం మోసే మనకి గాని... లాగే మనకి గాని ఆలకి నొప్పులు తెలీవు... యిప్పుడు మన యింటి మీదొచ్చి పడుతున్నారు. నేను పోలీస్టేషన్లకి తిరగలేను. నీ పనులకు నా వుద్యోగమూ పోతుంది.. అందరం అడుక్కుతిందాం...

-ఎన్నాళ్ళనుంచి దాచాడో అన్నయ్య కక్కేసాడు.

తనాశ్చర్య పోలేదు, యిలాంటిదొకరోజు వస్తుందని ముందే వూహించాడు. ఏమైనా యిల్లిప్పుడొక రచ్చబండ. వూరూ వాడా యిల్లూ గడపా నిండి పోయినిల్చున్నారు జనం.

తనుదోషికాడు, దోషిలా నిల్చోలేదు...

"పునరావాసం కింద యిచ్చిన బూమి గీమి వద్దన్నావట... ఆ డబ్బూ దస్కం వొద్దన్నావట. వొద్దని రిటన్‌గా లెటరు కూడా పెట్టావట కదరా... వొక్కమాట మాత్రంగానైనా మాతో యెందుకు చెప్పలేదు..." చినమావయ్య పెద్ద మనిషై నిలదీస్తున్నాడు.

"వాడెందుకు చెపుతాడ్రా? అప్పు చేసి అందరికీ లంచాలు పంచింది నేను. కంచాలు వేసి మంచాలు పరిచింది నేను... ఆల గుద్దమూడు సుట్లూ తిరిగింది నేను. అరిగింది నేను... అప్పులు తెచ్చి పిప్పి అయిపోయింది నేను..." అన్నయ్య రాజ్యానికి మరో రూపంలావున్నాడు. నాకోసం మాట్లాడు తున్నట్టే వున్నాడు?!

'కావలేఁ... వద్దంటె యిన్నావా?... ఆకాసానికీ బూమికీ అంబలట్టికిలాగ మోరసాపీసి తమ్ముడని అడ్డగ పడిపోనావానాడు. కావాలేఁ,... సిగ్గులేనోడికి వుచ్చబోసి బుఱ్ఱగొరిగితే- యెన్ని ముంతలని అడుగుతాడు. అంతకన్న యేటడుగుతాడు నీ తథమ్ముడు..." వొదిన వెక్కిరింతకు అన్నయ్య వోర్చుకోలేక పోయాడు. ఒకటే తాపు తన్నాడు. గోడకు అంటీసింది. స్వరం దుఃఖమయం!

తను జడ పదార్థంలాగ అలాగే నిల్చున్నాడు.

వొదినకు వుపచర్యలు జరిగి ప్రాణం నిలబడ్డాక, కక్ష్యలోకొచ్చారందరూ.

'నేను పెంచలేను.. నాయింటవుంచలేను' అన్నయ్య ఆఖరిమాటలాగుంది.

తను అంత భారమైన సమయంలో 'విలువలు లేకుండానా' అనడం అడగడం తేలిక చేస్తుంది. ఆ పదంకూడా పెదవి దాటి రాలేదు, లోపల లోపల కొట్లాడింది. కొట్లాడుతున్న యింకయేదో బయిటకురాకుండా వుంది.

అమ్మ నాలుక తెగినట్టు నరనరాలు తెగినట్టు నోట్లో గుడ్డలు కుక్కుకు కూర్చుంది.

తన ముసలి పడుచునేస్తం 'కాళ్ళతో ప్రపంచాన్ని తన్నీరాదా?' అన్నట్టు తనవంకే చూస్తూ కళ్ళ ముందు లేని దేన్నో బొటని వ్రేలితో తంతోంది.

"నీ మనసులోని విషయం ముందే చెప్పంటే బాగుణ్ను. అప్పు చేసి సప్పు చేసి తనకా తాకట్టు పెట్టి యెందుకిదంతా? నువ్వెక్కడో అడివిలో వున్నావు. యిక్కడి బోగట్టాలు నీకు తెలీవు. బోద కావు. బోద పరచుకోలేవు. యిక్కడుండి యివన్ని చేస్తున్న మాకే అర్థం కావడం లేదు. తలపండిపోతంది. నలుగురు నడిచిన దారి అది దొడ్డి దారయినా అడ్డదారయినా మనకి ప్రమాదం లేదు... 'నువ్వు బయిటికి రావడం మొదలుకొని యేది దారమ్మట జరిగిందో చెప్పు..." మామయ్యో మరో పెద్దమనిషో ముడిముక్క మాట్లాడేడు.

"యిదే తెలంగాణాలో మరెక్కడో అయితే యిన్నాళు ఈడ్ని తిరగ నిత్తురా? యెప్పుడో యేసేద్దురు..." కంఠం ముడి తెగిపడేమాట అన్నయ్య అనేసాడు.

మందుపాతర పేలిందా?

'నీనుండి యెప్పుడు సుకపడ్డామో సెప్పురా?!' వొదిన యేడుస్తోంది.

అమ్మకంటంట వొక్క నీటి చుక్కలేదు!

చాలాసేపు నిశ్శబ్దం..

భరించ వొల్లగాకుండా వుంది...

'నే వెళ్తున్నా...'

తన మాటకి మరో మందు పాతర ఆయింట పేలినట్టేవుంది.

'వుద్యోగం వెతుక్కున్నాను..'

నల్లటి పొగ చూరిన ఆకాశం మబ్బుల్ని దులిపి... అందరినాలుకల మీద నాలుగు వాన చినుకులు చల్లినట్టయింది.

సంచి అందుకున్నాడు.

కిట్టులా గలగలమందది!

అక్కడే వున్న 'స్వరం' మౌనంగా వుండలేక మొగలేక అవస్థ పడుతోంది. ఏమనే ధైర్యం తనకి చాల్లేదు. పక్కనే వున్న పడుచు ముసలి నేస్తం బుగ్గగిల్లాడు. తనూ తనని గిల్లందే వదల్లేదు. 'రంగమెల్లినా మమ్మల్ని మర్సిపోకు' అంది. ఏడుస్తూ... నవ్వుతూ... అందరూ నవ్వుని నిలిపిపట్టలేకపోయారు.

అమ్మపాదాలు చేత్తో ముద్దాడినపుడు తన చేతులు వొణికాయి. అమ్మకూడా కంపించింది. అప్పుడు గట్టు తెగింది. దుఃఖం... వడివడిగా వెంట పండింది... అందకుండా పరుగుతీసాడు?

'నువ్వేడ్వబోకమ్మా

నువ్వు కురియబోకమ్మా

సల్లంగ దీవించి నను సాగనంపమ్మా...' అని అమ్మనడుగుతూ- వదిలివెళ్తూ- వెంట తెచ్చుకుంటూ?!

## 11

అమ్మకి...' అంటూ వుత్తరం రాయబోతే- 'అమ్మ'కి ముందు ఏమని సంభోదించాలో తెలియలేదు. సంబోధన కన్నా అందులో ఏమని రాయాలో అంతుపట్టలేదు. ఆఖరికి రెండు వాక్యాలు రాద్దామని నిర్ణయానికి వచ్చాడు.

మొదలు పెట్టాడు.

అమ్మా!

'నేనిక్కడ పదిమందికీ అన్నం పెడుతూ, రెండు పుటలా రెండన్నం మెతుకులు తింటున్నాను...'

మొదటి వాక్యం రెండో వాక్యాన్ని సాగ నివ్వలేదు. మొదటి వాక్యం చాలా అర్థాలు రేపింది. తిరుగులేదు... అనుమానాలు రేపుతుంది.. మళ్ళీ 'పదిమందికీ అన్నమంటే' వొకే అర్థం స్ఫురిస్తుంది... స్థిరపడుతుంది. అంతగొప్ప అర్హతని తను కోల్పోయాడు?!

ఉత్తరం నలిగి చేతుల్లో చినిగిపోయింది.

ఎవరికి రాయాలి? ఏమని రాయాలి? ఏమి సాధించాడని రాయాలి? ఎవరికో యెందుకు? తనకి తనే రాద్దామని అని పించింది.

'మిత్రమా!

రోజుకి వందమంది ఆడపిల్లలకు పెళ్ళిజేస్తున్నట్టుంది డ్యూటీ!

లేదా

సర్కస్ కోతిలాగుంది!

పొరపాట్న ఏగెస్ట్కైనా సాంబారో యిడ్లీనో అయిదు నిముషాలు లేటయితే- తిట్లు, బిల్లు తప్పుగారాస్తే లేదా ఆర్డరు తప్పుగా తీసుకుంటే బిల్లు నా తలమీద, కరెక్టు అయితే వాడి ఖాతాకి. హోటల్ ఫీల్డు గురించి నేర్చుకోవాలనే వుంది. యిమడడం కష్టంగా వుంది.... ఫుడ్ పరవాలేదు- ఎనిమిది గంటలనబడే పదిగంటలూ ఊపిరి తీసుకోవడానికే సమయం వుంటుంది. ఊపిరి వదలడానికి లేదు.

పొద్దున్న ఐదో గంటకనగా పగిలిన అద్దంలో పగలని (?) నీ ముఖం చూసాను. రిలీవర్ రాలేదు. వస్తే రాత్రికి వస్తాను. లేదా యిక్కడే కునికేస్తాను. అటూ యిటూ తిరగడ మెందుకు? వుండి పోతే రాత్రి భోజనమో... పొద్దున్న టిఫినో జేబులోకి చెయ్యి వెళ్ళకుండా నోట్లోకి వెళ్తుంది!

ఇరవై తొమ్మిదికి అరవైతొమ్మిదోసారి కోర్టు...

పార్వతీ పురంలోనే... 'కుట్రకేసు' కంటిన్యేషనా?

ముప్పైన అర్టీసికండక్టర్ల రాత (తలదా) పరీక్ష!

నీకు వీలుచిక్కినపుడు నువ్వూనేను వొకటే గనుక మాట్లాడుకుందాం... శలవ్... ఆదాబర్సే!-

' యిట్లు (నాకు) నేనే!

'పిచ్చితుకారాం' అమ్మొక్కమొట్టు మొట్టినట్లయింది. అవడంకాదు, సూపరు వైజరు నిజంగా మొట్టాడు.

'రూమ్ నెంబరు ఫోర్నాట్ టూకి వెళ్ళు...'

'యస్సార్...'

సడెన్‌గా అంటే ఓ పెద్దాయన తిండీ షెల్టరూ అన్నీ ఆలోచించి యిందులో పెట్టాడు. స్టార్ హొటలే.. నెలవూ కొలువూ!

'సారీ డిస్టబ్ చేసాను, ఫోర్నాటు కాదా, ఫోర్ట్వంటీ... సో .. సారీ' సాగదీసి క్షమాపణలు చెప్పాడు. ఆ కాంట్రాక్టరు కళ్ళెర్రజేసాడు. బుద్ధీ బుర్రా వుందా? తలకాయెక్కడపెట్టుకు పనిచేస్తారో... దండకం చదువుతున్నాడు. బంగారం లాంటి నిద్రపాడయి పోయిందట. వోనరుగాడు యిటే వస్తున్నాడు. విన్నాడు... ఆ అలీవ్‌గ్రీన్ దుస్తులే తనికి వుంటే ఆడూ ఈడూ కలిసి వుచ్చపోసుకోరూ?!

తనేమి వినదల్చుకోలేదు.

ఆర్డరు కోసం గది బెల్లు కొట్టకుండా గాబరాతో పరిగెత్తి గదిలోకి దూరాడు. పోలీసు పెద్దాయన గదిని బ్రోతల్ హౌస్ చేసుకున్నట్టున్నాడు. తన్ని చూడ్డంతో అదిరిపడ్డాడు. తేరుకొని ఆర్డరిచ్చాడు...

ఎవరెవర్నో యెక్కడెక్కడో చూసినట్టుందే?!

'మందు కొట్టొచ్చావా వుద్యోగంలోకి?' ఓనరుడే!

'నాకు సెలవు కావాలి...' తనకితుపాకీ కావాలని అడిగితే చూసినట్టు చూసాడు.

'ఎప్పుడూ తెగపెడతావ్.. యెందుకు?'

'కోర్టుకి..'

'కోర్టుకా?'

'కాదు, వాయిదాకి..'

'నువ్వెళ్ళు.....'

'యస్సార్...'

'మర్రాకు...?!'

'థాంక్యూ....?!'

-"ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళూ
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మ ఎవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే
బిక్క ముఖాలతో చూస్తారేం?
పిచ్చివాణ్నిగా కేసు పుటప్ చెయ్యండి
నన్నెక్క నివ్వండి బోను... నన్నెక్క నివ్వండి బోను-
ఎచటికి పోతావీ రాత్రి?.... యింకెక్కడికి కోర్టుకి!?

## 12

కోర్టులో బంతి!

బంతి కోర్టులో పడ్డాక వాలీబాలయినా ఆడుకుంటారు. ఫుట్ బాలయినా ఆడుకుంటారు. టెన్నీసయినా ఆడుకుంటారు. బాడ్ మెంటనయినా ఆడుకుంటారు. ఆఖరికి క్రికెట్టయినా ఆడుకుంటారు. అలిష్టం!.. ఆలరాజ్యం..!

... చాలా బంతులుంటాయి గనుక వొకే బంతితో యేమాడు కుంటారు. ఆడేవాళ్ళకీ బోరుకొడుతుంది- వొక్కో సారి వొక్కో ఆట ఆడుకున్నాసరే...!

అలాంటప్పుడు గోడకు కొట్టిన బంతిలా వెనక్కొచ్చి వూర్లోపడతాడు...

తనిప్పుడలానే పడ్డాడు.

కథ మొదటికొచ్చింది... పాడిన పాటే పాడుతున్న పాసిపళ్ళ దాసరి...

పక్కింటి పడుచు ముసలియింటికి మకాం మారినా- తిండి తిప్పలికి తిప్పల ముప్పులు తప్పవు గదా?!

'భవతీ భిక్షాందేహి.." మళ్ళీ వొండి వోర్చుకొనేదేమిటి? సారీ-

"మాతాకవలం..."

'అమ్మా పిడికెడు అన్నం పెట్టుతల్లోయ్..' అనకపోయినా అమ్మలానే పిలిచి అన్నం పెడుతుంది వొదిన. దొంగతనంగా యింట్లోకి వెళ్తున్నట్టు వుంటుందే... తల నరికేసినట్టు మెడ వేళాడి తల లెగదెందుకో? మాటలుండవు. మబ్బులుండవు. మవునం. తలవెంట్రుకతో గొంతుక తెగుతున్నట్టు తడారిపోతుంది.. పొలమారిపోతుంది...

ఏ తల్లి తలచిందో? ఏ చెల్లి పిలిచిందో? ఏ అక్క కేకేసిందో! అన్నమో... సోడి అంబలో... టెంక పిండి అంబలో... అదో యిప్పపూల తేనె! తాగుతుంటే తనివి తీరిపోయేది!?

మరిప్పుడు నాలుగు రుచులూ తింటున్నా నాలుకమీద లాలాజలం స్రవించదేం? కూచోని

తింటే కొండలు తరిగిపోవా? అన్నట్టుంటుందేం? 'కూచోబెట్టియెన్నాళు కూడెడతాం?' అని నిలదీస్తున్నట్టుంటుందేం? నోటిముందు కూడు యెవరో లాగేస్తారన్నట్టు గబగబా నాలుగు ముద్దలు మింగి మింగక... ఎవరో వెంట తరుము తున్నట్టు యింట్లోంచి పారిపోవడమేమిటి? సిగ్గుసెగలూ అవమానం అగ్గులూ రాజుతున్నదెందుకో?

కన్న తల్లి పరాయిదయిందా?!

వున్నవూరూ పరాయిదయిందా?!

నాకు నేనే పరాయినైనానా?

తలపగిలిపోతే బాగుణ్ను. తనువు కాలి బూడదయితే బాగుణ్ను. తను నేలకొరిగి పోతే బాగుణ్ను  యిది యుద్ధమా అలా జరగడానికి!? కాదే?!. దయాదాక్షిణ్యాల కోసం... ఎాలి కరుణకోసం దేబిరించడమేమిటి? యెవరి దోసిళ్ళోనో తినడమేమిటి?!

తనదోసిలి తనేయెత్తుకున్నాడు.

తనజోలె తనే పట్టుకున్నాడు.

"భవతీ వుద్యోగం దేహి..."

'నాకు టెన్త్ నాలుగైదొందల మార్కులున్నాయి. సైన్సు డిగ్రీ డిస్కన్యూ అయినా ఆర్ట్స్ డిగ్రీ ఆంధ్రాయూనివర్సిటీదే వుంది. ఆర్టీసీలో కండక్టరు వుజ్జోగానికి రాత పరీక్షలో కూత పరీక్షలో అయి పోయాయి. కాక పోతే ఓటర్లలిష్టులో వుండాల్సిన నా పేరు పొరపాటునో గ్రహపాటునో పోలీసుల లిష్టులో మీ దృష్టిలో వుంది. నా బంతి జిల్లా కోర్టుల్లో వుంది. అంతకన్నా ముందు మీ కోర్టుల్లో వుంది. మీరు బంతి (నా నోటి ముందు కూడు)ని తన్నకుండా వదిలేయండి సార్... దాని మన్నాన దాన్ని వదిలేయండి సార్. అదే మీరు చూపిన తోవ... మీరు పెట్టిన బిక్ష...'

కళ్ళ నీళ్ళ పర్యంత మయాడు..

కాలివేళ్ళ పర్యంత మయాడు...

జీవితం నిలబెట్టే వుద్యోగం...

జీవితాన్ని నిలబెట్టే వుద్యోగం...

జిల్లా పోలీసు సూపరెండెంటుని వేడుకున్నాడు.

జిల్లా కలెక్టర్నీ వేడుకున్నాడు.

నియోజక వర్గ ఎమ్మెల్యేని వేడుకున్నాడు

జిల్లాలోని రాష్ట్ర మంత్రిని కలిసి వేడుకున్నాడు...

పునరావాసం కల్పిస్తామన్న వాళ్ళే తన వాసం కూల్చేస్తారా? న్యాయ సమ్మతంగా- ధర్మ సమ్మతంగా- అర్హతల సామర్థ్య సమ్మతంగా- వస్తున్న వుద్యోగాన్ని - కేసులున్నాయని కొట్టేయవద్దని మొరపెట్టుకున్నాడు. జోలె పట్టుకున్నాడు.

''భవతీ వుద్యోగం దేహి...''

ఆనాడు నాలుగైదేళ్ళ క్రితం ప్రాణబిక్ష పెట్టమన్నాడు. అవాళే లేని సిగ్గు యివాళ యెందుకు? యెవరో యేదో అంటారని దిగుల్లేదు, సంకోచం లేదు. వున్నా-అన్నా- అన్నా వాళ్ళెవరూ అరపూటో ఆరుపూట్లో అన్నంపెడతారుగాని జీవితాంతంపెట్టరు. పెట్టలేరు. తల్లి కడుపులోంచి బయట పడ్డంతోనే... పేగు తెగడంతోనే బిక్షాటన మొదలైంది...

'దయ చేసి నన్ను జనజీవన స్రవంతిలో కలవనివ్వండి'!

'జన జీవన స్రవంతిలో కలవ నివ్వండి'!

'కలవ నివ్వండి'!

''ముందు దగా- వెనుక దగా కుడియెడమల దగా దగా

(మ)నాదీ వొక బతుకేనా?

కుక్కలవలె.. నక్కల వలె...

సందులలో పందులవలె...-''

ప్రతి సందూ తిరిగాడు. ప్రతి గొందూ కొలిచాడు. ప్రతి గుమ్మీ పార్లాడు. వుక్కు పిడికిళ్ళ చేతుల్ని వుచ్చలగుంటల్లో నానబెట్టాడు. వుమ్మేసిన చోటే వుదతలా బతుకుగుడ్లు పొదుగాలను కుంటున్నాడు.

''చదువు మాయ- బతుకుమాయ- కవిత కరక్కాయ సుమీ...!?'

## 13

'హోల్డన్... హోల్డన్!'

బస్సు ఆగింది.

గుండాగినంతపనయింది.

'నీకు వొదిలెయ్యడానికో వుజ్జోగమూ... కాల్చెయ్యడానికో బస్సూ దొరికాయన్న మాట' మిత్రునిహాస్యం తూటాలలాస్యమే! యేస్టేజిలో దిగి వెళ్ళాడో మిత్రుడు నా ఒడిలోనో నాలోనో కూర్చున్నాడు.

హమ్మయ్యా ట్రైనింగే..... ఫరవాలేదు?!

'కండక్టర్లకు శిక్షణ' దాటి తను చాలా ముందుకు వచ్చేసాడు. ఇనస్ట్రక్టరు వెనక్కి పిలిచాడు. తను క్లాసులో కూర్చున్నాడు.

యింటి పేర్లతో సహా పరిచయపత్రం చదవమంటున్నాడు. యిల్లూ వాకిలీదాటి 'రోడ్డున' యెలాగు పడతాం గదా? పెరట్లోకి గతంలోకి పదండన్నారు. ఎవరి లంకెలబిందెల్ని వాళ్ళు యెత్తుకొచ్చిపెట్టారు.

నిజం నిప్పు, అగ్గిఅంటుకుంటుందని దాచకుండా చెప్పాడు. గుప్పుమంది క్లాసులో సగం

ఖాళీ. రేపు బస్సులో అంతా ఖాళీ?! జీవంలేని నవ్వొకటి పెదాలమీద అతికించుకున్నాడు. వచ్చిన పామైనా యెడమెడంగా కూర్చున్నారు.

క్లాసు మొదలైంది!

'టికట్లు చింపివ్వాలిగాని, చిల్లరలేదని నోట్లు చింపియివ్వగూడదు...' అయ్య వారి హాస్యం తేలిక పరిచింది.

మనుషుల్నెలా కొట్టాలి?' అన్నట్టుగానే 'టికెట్లని యెలా కొట్టాలో' చెప్పుతున్నాడు. అర్ధటికెట్టు కొడతారు సరే, ఫుల్ టికెట్ యెలా కొడతారు- అర్ధటికెట్నే' అన్నవాళ్ళని. అన్సరూ చెపుతున్నాడు.

"ఆడపిల్లయితే, యేటి? అమ్మాయయితే అక్కడా యిక్కడా చూసికాదు, చూడాల్సిన చోట గుండెచూసి- ఆడుతోందో లేదోనని కాదు- పిడికిడేసున్నా చాలు- వెనక్కి తిరిగి చూడక్కర్లేదు' ఫుల్లుగా కొట్టేయండి'

ద్వంద్వార్థం కాదు ప్రతిపద నానార్థంతో ప్రతొక్కరూ నవ్వుతున్నారు.

ప్చ్... జనజీవన ప్రవంతిలో తను మళ్ళీ వెనుకబడుతున్నాడు.

పిడికిళ్ళుతో తెంపుకొచ్చినట్టు వూపి వూపి చూపుతున్నాడేగాని వదలడే!

... యిదేదో పోలీసు ట్రైనింగులా వుందే?! అందరం పోలీసులమయి పోతున్నామా? రాజ్యం యిక క్షేమదాయకం!?

.... ఆడదయితే చనుకట్టు... మగాడయితే మీసకట్టు... చూసి కొట్టాలి టిక్కట్టు...

"... కొమ్మ చివర పూల తొడిమలా సాగిన మెడ కింద

అరిటాకు లాంటి చీలికకు అటూ యిటూ

ఘనమూ ద్రవము కాని మనసుకి

అచ్చమైన బహువచనం

ఓహ్!..'

హృదయానికి బహువచనం కాదు, తనకంతా యేకవచనమే! యే టికెట్టు కత్తిరించినా ముందు కళ్ళతో రొమ్ములు కత్తిరిస్తున్నాడా? మగపిల్లలు మీసాలు గీసుకున్నట్టు ఆడపిల్లలు రొమ్ములు గీసుకు రారేం? ఈకళ్ళ మీది పొరలు వుద్యోగానికి వేసుకున్న దుస్తులంత సహజమై పోయాయి. మంత్రించి వదిలారు. జపించి తిరుగుతున్నాడు తను.

ఎప్పుడూ లేంది, 'స్వరాన్ని' అలా చూసాడేం?! గమనించిందేమో 'స్వరం' పైటని తగలెయ్యకుండా సర్దుకుంది. కళ్ళకెప్పుడూ డ్యూటీయే, బస్సులో వున్నా లేకున్నా. టికెట్టు కొట్టినా కొట్టకున్నా... వొక వ్యసనమేదో అలవడింది! 'పైటల్ని కాదు, నన్నే తగలెయ్యాలి' అనుకున్నాడు తను. 'నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే ముందుగా పైటకన్నా ముందుగా నన్నే తగలెయ్యాలి అనుకోవడమే ఆచరణ దాని పని దానిదే?!

ఉద్యోగములాంటిది... మోటారు ఫీల్డులాంటిది తనూ అంగీకరిస్తున్నాడు...?

తనతో ఆవేకువ వేళ... వేకువ ఝామున... డ్రైవరేమన్నాడు. పెళ్ళాం పక్కలో వుండాల్సిన టైమన్నాడు. అక్కడితో ఆగాడా? టీ కుర్రాణ్ని పిలిచి 'అప్పుడే మీ యమ్మపాలు తాగీసొచ్చినా వేట్రాలంజికొడకా, నీకు చలిలేదు, మాకేటీ చలి?' అని చలి కాచుకున్నాడు. యెందుకో ఆసెగలు తనకీ పత్తింగా వుంటున్నాయి?!

ఎంత పత్యంగా వున్నా- వొక రోజా...వొక వారమా... వొకనెలా? రెండు వందల నలభై రోజులు చేస్తే పర్మినెంటవుతుంది!? రెండు వందల నలభై రోజులు రెండు సంవత్సరాలకి సర్దుకున్నట్టే వున్నాయి!? ఎవరో వొకరు రాకపోతే వాళ్ళ ప్లేసులో.వెళ్ళాలి. వేకువ ఝాము నాలుగ్గంటలనుండి మధ్యాహ్నం పదకొండుగంటల వరకూ గోతికాడ గుంటనక్కలా కాయాలి. ఎవడూ రాకపోతే వుజ్జోగం! లేదూ... రాలేదూ... అనుకున్నోడు ఆఖరి నిముషానొస్తే వుజ్జోగం వుష్...!

యిదొక దాస్యం..!

వుద్యోగంలో రోజూ వురుంటుందా?!

ఆ అలసట, ఆ నిద్రలేమి, ఆ బ్రహ్మచర్యం, ఆయా సహవాసాలూ.. నెలకి నాలుగు డబ్బులు... లోపల కాల్తున్న గుండె. మందు మంటను చల్లార్చదూ?!

మంటను చల్లార్చిందో లేదో గాని, జేబుని చల్లార్చింది!

వూర్లో సహవాస గాళ్ళకూ స్నేహితులకూ సన్నిహితులకూ- అదీ నోరు తెరిచి 'పార్టీరా' అని అడిగాక యివ్వ కుండా యెలా వుంటాడు? ఫార్మాలిటీ తప్పదన్నారు. అవునవునని అన్నయ్యా మావయ్యా వంత పలికారు. దాంతో యింట్లోనే కోడికూర! ఆశ్చర్యంలేదు... దాపుడు మూపుడుగా మందుకూడా! అన్నయ్యా మావయ్యా భాగస్తులయారు. పారీ పోరకుండా తెలిసీతెలియకుండా తనూ వేసుకున్నాడు. వొదినే వంటచేసి పెట్టింది.

వొంగి విరిగి మీద పడుతుందా అన్నట్టు యింట్లో యింద్రధనసు వెల్లివిరిసింది!

స్టయిఫండనబడే తొలి జీతమూ లాగే- మలి జీతమూ మజిలీ మార్చు కోలేదు. పనిచేసే చోట నెలకు మూడ్రోజులు తను పార్టీయిస్తే- మిగతా ముప్పైరోజులకు సరిపడా రూమ్మేట్స్, బేచ్ మేట్స్.... ఋణం వుంచుకొనే వారు కాదు, యెవరిదో వొకరిది యేదో వొకటివుండేది.

తనకి మగతగా వుంటోంది, మత్తుగా వుంటోంది..." మోయలేని ఆలోచనలూ తెగి అంటుకొనీ తేలిపోతున్నాయి... అదిచాలు!

"... పెళ్ళి చేస్తే ఆడే దార్లో పడిపోతాడు..." వీధిలో వాళ్ళదే కాదు, యింట్లో వాళ్ళదీ అదేమాట. పిల్లనెవరిస్తారో?

'సెంకల పొదెట్టుకోని వూరళ్ళా యెతికాడట... యెనకటికి నీలాటోడు, స్వరం' వుందిగదా?' ఎవరెవరో అన్నారు. కట్నం యెత్తి యివ్వక్కరలేదని కారణమూ చెప్పారు.

వొదిన అడ్డంగా తలూపింది.

"అడి గుర్రానికాడు గడ్డేసుకోలేడా?"

"గడ్డేస్తాడనే...!"

గొడవ యెంతో దూరం పోయేది, కాని 'స్వరం' పలికింది. 'బావని తప్ప ఎవరినీ చేసుకోనని!

తను పెళ్ళికొడుకవుతున్నాడు. వొకయింటి వాడవుతున్నాడు. సన్నాసితనం పోయి సంసారవుతున్నాడు!

కొంచెం... కొంచెం... కలవగలుగుతున్నాడు!

అదిగో జనజీవన స్రవంతి!? వూహల భవంతి!?

యింకెంత దూరం? కోసెడు... కోసెడు దూరం!!

## 14

బంగాళాఖాతంలో అల్పపీడనం!

ఎడతెరిపిలేని వాన... యేడేడు పద్నాలుగు రోజులుగా ఈదురుగాలులతో వోవ్'... అని వొకటే గాలీవాన. ముంజూరు దాటి అవతల అడుగుపెట్టడానికి వల్లగాకుండా వొదల కుండా వుంది ముసురు. యింటి యెన్ను మీద గడ్డిలేచిపోతోందా.... దారలుకట్టీ కట్టీ పెనకల్లోని గడ్డి పెనకల్లోనే కుళ్ళిపోతోందా? యిటు మనిషటుగాని అటు మనిషి యిటుగాని కదల్డానికి లేదు... పశువులు పక్షులు ప్రాణాలు పోయినట్టు అలికిడి లేదు.... మట్టే కరుగుతోందో? మిన్నేమీద పడుతోందో? మట్టి గోడలే కూలుతున్నాయో... మనుషులే కొట్టుకు పోతున్నారో తెలియడంలేదు... వానచినుకు వళ్ళంతా యిల్లంతా కనుచూపుమేరంతా విస్తరించివుంది.

ప్రపంచం స్తంభించి పోయింది!

భూమీ ఆకాశం కలిసే చోటు... ఆకాశం ఆవలి అంచు... ఎవ్వరూలేని ఏకాంత సరోవరం... ప్రపంచం అంతమై తామిద్దరమే మిగిలిపోయినట్టు... ఆడమ్ అండ్ ఈవ్.. అయి పోయినట్టు కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్టు కొత్త కొత్త కలలు గంటున్నాడు.

ఎప్పటికీ యిలాగే వుండిపోతే యెంత బాగుంటుందీ!'

స్వరం వులిక్కిపడి దెయ్యాన్ని చూసినట్టు చూసింది.

'ఈ పాటికే పెళ్ళయితేనా...?! యేళ్ళకు యేళ్ళు యిలానే గడిపెయ్యనూ?!'

కళ్ళు తెరవడేం?

'నాస్వరం.. నాపెళ్ళాం.. నాకోసం రెండు కన్నుల వేయి వొత్తులు వేసి వెలిగించుకు నా కోసం మాత్రమే బతికే నా మనిషి.. నాలో సగం.. నా పిల్లలు.. రత్న మాణిక్యాలు... యెన్నినాళ్ళ వూహలు... దాక్కొని దాక్కొని బయటికొచ్చాయి? వూఁ... యెంత శాంతి... మరెంత ప్రశాంతం? నా బతుకునాది... నేను బతుకుతాను... నన్నెవరు తప్పుపడతారు? యెందుకింకా తప్పుపడతారు. 'వాళ్ళయినా-' 'పెళ్ళాం బిడ్డలతో వున్నాడని... యిక యింకెక్కడికి పోతాడని అనుకోరూ'... కేసులూ కోర్టులూ

వాయిదాలూ... యెత్తుకుంటే యెడతెరిపి లేకుండా నరాలు చిట్లిపోయే ఆలోచనలూ... యేమీలేవ్... వుండవ్...'

తనూ లేడూ?

..... ఎలగుంటున్నారో ఈవానకీ?' స్వరం మాటేనా?

ఎవరిని గురించి?... అందరూ యింట్లోనే వున్నారుగా... మరెవర్ని గురించి బయటెవరున్నారు. బయటంటే... లోపల... లోపలనేనా? తల్లికడుపులో తడిచేదేమిటి? ఎండేదేమిటి?... అగ్ని అంటుకున్న వానలో అగ్గిపుల్ల వెలగదు... పగటికీ రాత్రికీ తేడా తెలియదు.... కడుపుకింత వుండదు... వారమూ పదీ పక్షం రోజులయినా ఎండకు యెండినట్టే వానకి తడిచీ... ఆరోహణ... అవరోహణ... అంతంకాని అంతులేని ప్రయాణం...

యిక్కడ తన నాలుక చేదెక్కిందేం?!

యిదేమిటి? నీటితుంపరా? వాన ముద్దా? లేదు... కాదు... స్వరం నా ముఖాన కేంద్రించి వుమ్మిందా?!

వుమ్మదూ?

వూరికి తీర్పు చెప్పాల్సిన వాడిని... చెపుతున్న వాడివి... వూరే తానై చూసుకున్న వాడివి... వూరోలింట్ల దూరితే... వుమ్మదూ.... వూరంతా వుమ్మదూ?

రెండు అరచేతులతో తుడుచుకుంటున్నాడు, జిగట జిగటగ వుంది...!

ఒంటరి తనమంత భయంకరమైనది లేదు. యేకాంతమంత ప్రమాదకరమైంది లేదు. అటువంటి ఒంటరియే కాంతం లోంచి పుట్టింది ప్రేమా? రెండు దేహాల అగ్నిని చల్లార్చు కొనే దాని పేరు యేదయినా పెట్టు... నీకు శరీరమే కావలసి వొస్తే... పరిచాను... మనిషిగా మిగులు...!

స్వరం మాట్లాడుతోందా? తెలీదు... బయట హోరు!

వాన వెలిసిందాక వర్తమాన మేదో తెలుస్తోంది కాదు!

ఆత్మవిమర్శ చేసుకుంటే అసహ్యం... దుఃఖం కలగాపులగంగా యెత్తిముంచాయి. తలుపులు మూసుకు తనెంత యేడ్చినా తీరదే? సంఘాలతోనూ సమాజంతోనూ ఎవరితోనూ తన వునికికి పనిలేదు. వుండకూడదు. సూసైడ్ చేసుకోవాలని పిస్తోంది. చచ్చిపోవాలని పిస్తోంది... యెక్కడి వక్కడ తెంపుకున్నాడు.

ఎండ... కొద్దికొద్దిగా ముసురుని తినేస్తోంది...

మబ్బులు మాయమవుతున్నాయి....

అంతాకడిగేసినట్టు... అందులో చాలా కోల్పోయినా...

యెండి చేవచచ్చిన చెట్టు... తిరిగి మొలకలేస్తున్నట్టూ... చిగురిస్తున్నట్టూ...

ఆశ అణువంతచాలు...

నిలబడ్డాడు... తిరిగి నిలబడ్డాడు. నిబద్ధతనీ నిర్ణయాన్నీ నిండుగా వూపిరిపీల్చుకున్నాడు. తెగిన వాటిని ముడేసుకున్నాడు.

స్వరానికి 'ముడెయ్యడానికి' ముహూర్తాలు చూస్తున్నారు...

లోపల లోపలంతా యుద్ధరావమే, యుద్ధమే!... అంతా యెరిగి బయటంతా అందరూ ప్రశాంతం... మాములే... సహజమే... సహజాతాలే నన్నట్టు!

కొత్త జీవితానికి తెరతీస్తే... ఎవరో వచ్చిరిబ్బను కత్తిరించి వెళ్ళారు.

రిబ్బనేనా? వృత్తి రిబ్బనే కత్తిరించేరా?

ఉద్యోగం కత్తిరించారు!

జరగాల్సిన పెళ్ళి పీలికలయి తెగిపోయింది!

'వుద్యోగమయ్యాకే పెళ్ళి... వుద్యోగముంటేనే పెళ్ళి'...

కథ మొదటి కొచ్చింది, తనూ మొదటికెళ్ళాడు.

"నా వుద్యోగం... నా వుద్యోగం..."

పోయింది దొరుకుతుందనే?!, యెక్కడెక్కడో వెతుకులాడాడు, యెవరెవర్నో అడిగాడు. పిచ్చివాడిలా తిరిగాడు. తిరుగుతున్నాడు. కాళ్ళూ గొంతూ అరిగేలా... కుక్కలా పిచ్చికుక్కలా...

నాకు చోటివ్వరూ... ప్లీజ్...! జనజీవన స్రవంతిలో కొద్దిగ జాగాయివ్వరూ?!

## 15

"మీవాడు పూర్తిగా సరెండరు కాలేదు.."

'కాలేదా?!'

"అయితే వుద్యోగ మెందుకు పోతుంది? అయినా రెండుచోట్ల రెండుద్యోగాలు యెలా చేస్తాడు? అందుకే పనిభారమెందుకని ప్రభుత్వమొక వుద్యోగం తగ్గించింది..."

'ఎలగెలగెలగ?'

"పెరిడిలో ఐవి మాష్టారూ అప్పల సూరి స్మారక స్థూపమూ... కోవర్తిలో సభా .... బొడ్డపాడులో సమావేశమూ.... ఎక్కడ జెండా ఎగిరినా- ఎజెండా మీదకొచ్చాడు! కోపర్‌డాంగ్ ఎన్‌కౌంటర్ మీద నిజ నిర్ధారణకు వెళ్ళిరావడంతో- మా నిర్ధారణా తేలిపోయింది.."

'...............'

సరెండరు కావడమంటే ఏమిటి?

సముద్రమ్మీదొక కాలు. భూమ్మీదొక కాలు వేసేవాడికి పడవలెందుకు? పనికిరాని వుద్యోగా లెందుకు? కాళ్ళు పట్టుకోవడమా? కన్నెప్ప చాటులో కాలుదువ్వడమా? సరెండరా? సడన్‌గా

ఎటాకిస్తాడా?

జనజీవన స్రవంతిలో కలియడం అంతే తేలికయిపోయిందా?

జనజీవ స్రవంతి  అంటే ఏమిటి?

సరెండరు కావడం!

సరెండరు కావడం అంటే ఎలగుండాలి? అచ్చం మొగడూ పెళ్ళాల్లా గుండాలి. ఆఫీసరూ పర్కర్లలాగుండాలి. మీరు టీచర్లు... మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకి సరండరవుతారు గదా? మా ఆఫీసర్లూ మా ఆఫీసర్లూ ఆలూ ఈలూ పేలూ మంత్రులకీ ఎమ్మెల్యేలకీ సరెండరు కాకుండా వుండరు గదా... ఆ ఎమ్మెల్యేలూ ఎంపీలూ మంత్రులూ సియమ్ముకి సరెండరే గదా... సియమ్ము.. అఁ.. వరల్డుబేంకుకి సరెండరు గదా...

'హెడ్డు' హెడ్డు తినేసాడు!

తిన్నా-వొక వుపాయం చెప్పాడు. వాతావరణం బాగోలేదు. తల మీద పిడుగుపడుతుంటే గిబ్బగొడుగూ పుట్టగొడుగూ కాయవు. కాయలేవు... అంచేత... యుద్ధం మొదలైపోయి నంచేత... అపార్టీయో ఈ పార్టీయో తేల్చుసుకోమన్నాడు. తలని కాపాడు కోవడానికి తలపాగాలు చుట్టుకుంటే సరిపోవు, మరంచేత మరొక పెద్ద తలకాయే కావాల!

అలాంటి తలున్న నాయకునికి తల ఒగ్గేసాడు!

తానేకదా... కాని తన యింటందరూ సరండరయినట్టే వుంది?!

'కేసులా... యెపుడికి లేవు కేసులు. నాకు లేవా? నీకు లేవా? ఆ క్రిష్ణ పరమాత్ముడికి లేవా? గాంధీ గారి మీద లేవా? నెహ్రూగారి మీద లేవా? పోయిన రాజీవ్ గాంధీ గారి మీద లేవా? వున్న ఎల్.కె. అద్వానీ గారి మీద లేవా?....'' అని ఆగి- గుక్క తిప్పుకొని-

''మరంచేత కేసులుండాలి. వుంటేనే మనకీ బలమూ- ఆలకీ బలమూ. అదొక విడదియ్యలేని విడదియ్యరాని సమ్మందమంతే...'

భయం పోగొట్టేసాడు!

భరోసా యిచ్చేసాడు!

'ఎలక్షన్లవనీ అన్నీ చూద్దాం' అన్నాడు. 'రేపట్నుంచి డ్యూటీకి వొచ్చీ అన్నాడు. యివాళే డ్యూటీ అప్పగించేసాడు.

తన ఆమోదం, అంగీకారం లేకుండా చేరిపోయాడు!?

'యికన నీకేకుక్కలవల్లా బయ్యంలేదు...' ముసలాడు వొకడు ముసిముసినవ్వులు రువ్వేడు. దొడ్లోకెళ్తున్నట్టు రెండు వేళ్ళు ఎత్తి చూపించాడు, విజయానికి గుర్తట! అధికారపార్టీ అభయమిచ్చేసి నట్టు భుజమ్మీద చెయ్యివేసాడు. 'నాయకత్వం వర్థిల్లాలి!' గొంతుల్లో తనూ గొంతు కలిపాడు!

'జన్మభూమి'కి పాట రాయనన్నవాడు, ప్రచార రథమెక్కి పాటలు పాడుతున్నాడు, మాటలు

మాట్లాడుతున్నాడు రథం నడుపుతున్నాడు!

కర్రా పోయి కత్తీ వొచ్చే ఢాం... ఢాం... ఢాం...

అప్పటి వరకూ పడనున్న డ్యూటీలు తప్పిపోయాయి! ఎందరెందరు తనలాంటి మాజీలకు పడ్డ డ్యూటీ తనకు పడలేదు...

నక్సలైట్లు వేసిన పోస్టర్లూ బేనర్లూ తొలగించనక్కర్లేదు. బహిష్కరణ సమావేశాలు జరిగితే వెంటనే తెలియజేయాలన్న పనిలేదు. పోలీసులు గ్రామాల్లో నిర్వహించే సభల్లో సమావేశాల్లో వూరేగింపుల్లో పాల్గొననవసరం లేదు. నక్సల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలివ్వ నవసరం లేదు. పోలింగ్ స్టేషన్, టెలిఫోన్ ఎక్సఛేంజి, మండల కార్యాలయాల్లో రాత్రి పూట పడుకోనవసరం లేదు. బ్యాలట్ పెట్టెలకు రక్షణగా వుండనవసరం లేదు...

ఎన్ని బాధలు తప్పాయి?

ఎన్నెన్ని బాధ్యతలు తప్పాయి?

కంఠం మీద కత్తిలేదు. పసుపు పచ్చని కండువా రక్షక కవచమైంది. చిన్నా పెద్దా నాయకులే కాదు పెద్ద పెద్ద పోలీసాఫీసర్ల వరకూ ఫ్రెండ్సయి పోయినట్టున్నారే.... పలుకరిస్తున్నారే... పార్టీలిస్తున్నారే... పంచుకుంటున్నారే..

ప్రచార రథం అధికార మదగజం... యేడు గుర్రాల సూర్యుడు కదిలినట్టు...

ఆ రథ సారథిగా వూరువులు లేని అనూరుడు తను!

అనూరుడు తను!

లక్షణంగా ఎలక్షన్లు శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా జరిగాయి?

నాయకులు గెల్చారు, ఎప్పట్లాగే ప్రజలు ఓడిపోయారు! మరితనో...?!...

## 16

తాగించడం.. తాగడం- తినిపించడం.. తినడం- తార్చడం.. తీర్చు కోవడం... - నెలా పది రోజులుగా యిదే పని! పనుల మీద వొచ్చిన వాళ్ళందరిదీ యిదే పని. 'తన పని.. తనొచ్చిన పని' గుర్తుచేస్తే- 'ముందు వెనుకలగా అవదా? మానేస్తుందా?' అంటారు. వొచ్చీపోయేవాళ్ళ సంఖ్య పెరిగింది. రాపిడిపెరిగింది. అన్నీ... చూసుకోమని ఎమ్మెల్యే గారు తనగది(?) తాళాలిచ్చారు.

యిదేదో కొత్త కొలువులా వుంది!

అసలు ఈ ఎమ్మెల్యే క్వార్టర్సుని చూస్తే... వొచ్చీపోయే వందిమాగదుల్ని చూస్తే... యిదొక యూనివర్సిటీలాగ వుంటుంది. వుస్మానియా వీసీ కాదు ఆక్సుఫర్డ్ అమెరికా యూనివర్సిటీ వీసీకూడా వీళ్ళను ఖాళీ చేయించలేడు. తనే ఖాళీ చేసి వెళ్ళిపోవాలి!?

జేబు ఖాళీ అయింది!

మెదడు ఖాళీ అయింది!

మునుపు మూడు నాలుగు దఫాలొచ్చాడు. తమ 'నాయకుడు' గెలిచి ఎమ్మెల్యే అయాక. స్వంత తమ్ముడిలా చూసుకుంటాడు. చూసుకోడూ?... ఎక్సుపార్టీవోడు తనని తన్నొదిలాక వైద్యమూ తిరిగిలేవడమూ అన్ని తనే దగ్గరుండి చూసుకున్నాడు. సొంత ఖర్చు కొంత వదిలిపోయినా తను ముఖ్యుడై పోయాడు.

యిన్ని జరిగాక యింకెందుకని ఆనాడే ప్రజా సంఘాలతో సంబంధాలు తెంపుకున్నాడు. పోలీసులూ దాన్ని పత్రికా ప్రకటనలా వేయించారు.

యేవేవో జరిగిపోతున్నాయి...

కేసులు గురించి వొకసారి డిజీపీనే కలిసాడు.

హోం మినిస్టరుకు ధరఖాస్తుయిచ్చుకున్నాడు.

ఈదఫా ఎమ్మెల్యే మళ్ళీ దగ్గరుండి హోం మినిస్టరుని కలిపి వదిలాడు. చెప్పుకోమన్నాడు. తనకిలాంటివి తెలీవన్నాడు. కొత్తన్నాడు. యిదే నేను చేసిన సాయమన్నాడు.

ముహూర్తం రానే వచ్చింది.

తను చేతులు కట్టుకు నిల్చున్నాడు. తనని తను చూసుకుంటే తను 'లొంగి' పోయినప్పటి ఫైలు ఫోటో గుర్తొచ్చింది.

"మీఫైలు తెప్పించుకు చూస్తాను. అయినా కోర్టుల్లో వున్నాయి, చేసేదేం లేదు... మీనడవడిక బాగుంటే, మీరిక్కడిదాక రా అక్కరలేదు, అక్కడ మా పోలీసులే కొట్టేస్తారు... కేసు... ఇమ్మీడియట్‌గా మామూలు కేసులకూడా తేలవు..."

తేలవు... తేలవు... తేల్చరు... తేల్చరు... ఆరుకాదు నూరేళ్ళయినా తను మునిగి తేలడమే బతుకంతా...

తననోరు పెగల్లేదు. యేమని పెగులుతుంది?

యిక వెళ్ళొచ్చు' అన్నట్టు తలాడించారు మంత్రిగారు.

చచ్చుబడ్డ కాళ్ళతో- దారి మరిచి ఎప్పటి 'శవం'లా బయిటి కొచ్చాడు. భాగ్యనగరం ఎవరికి భాగ్యనగరమో... మరెవరికి అభాగ్యనగరమో...?!

నగరం పరిగెత్తలేనంత విశాలంగానూ- నడవలేనంత యిరుకుగానూవుంది. యెటుపోవాలో దారి తెలీకుండా వుంది. తెలిసిన దారి వొక్కటీ ఎప్పుడో మర్చిపోయాడు.

ఆసమయంలో యేదో పని మీదొచ్చిన మావయ్య పనిపూర్తయింది గదా పదమన్నాడు. అతగాడ్ని ఎమ్మెల్యే క్వార్టర్సులో వదిలి... చాన్నాళ్ళుగ వొదలని మిత్రులయింట ఆరాత్రి అన్నీమరిచి గడుపుదామనుకున్నాడు.

అలాగే వెళ్ళాడు, అతను తనలా కాక బుద్ధిగా చదవుకున్నాడు. బుద్ధిగాపెద్దలు చూసిన పిల్లని బుద్ధిగా కట్నం తీసుకొని పెళ్ళి చేసుకున్నాడు. బుద్ధిగా వుద్యోగంలో చేరాడు. హైదరాబాద్‌కు ట్రాన్సుఫర్ చేసినా వూరికి వెయ్యికిలోమీటర్లైనా బుద్ధిగా వొచ్చాడు. వున్నాడు. బుద్ధిగా అమ్మనీ

నాన్ననీ అన్నదమ్ముల్నీ అందర్నీ వొదిలేసాడు. బుద్ధిగా పిల్లల్ని కన్నాడు. (బుద్ధిగా సంసారం చేసే?) బుద్ధిగా పెంచుకుంటున్నాడు. బుద్ధిగా తన బతుకు తను బతికేస్తున్నాడు.

అతగాణ్ని చూస్తే హుస్సేను సాగరంలోని బుద్ధుడంత యెత్తుగా తన కళ్ళకు కనిపిస్తాడు. వాడంత బుద్ధికాదు, అందులో యింత రవ్వ బుద్ధున్నా తను బువ్వతిందుడు....ప్చ్....

ప్చ్....'

ప్చ్... నాకు వంత పలికింది మా బుద్ధిడి పెళ్ళాం...

"అందులోన.. చేరబట్టిగాని అన్నయ్యాఁ... లేకపోతేనా...." బుద్ధిగా నామీద జాలిచూపబోయింది బుద్ధిడి పెళ్ళాం.

"..... లేకపోతే... అమిరికాకి ప్రెసిడెంటయిపోదుడా? బిల్లుక్లింటనుకు పోటీ అయిపోదుడా?" అని మా బుద్ధుడే అనడంతో చిక్కురు కొని, బక్కురుకొని కళ్ళు పులుముకు చూసాను... బుద్ధుడే!

"... యేడాదో రెండేలో చేసినా పర్మినెంటుకాని కండక్టరుజ్జోగం... పర్మినెంటు కాకుండే పోయింది. ఏక బాధ... నేనే వుద్యమాల్లో వున్నాను? నీనేం విప్లవం తెచ్చాను? యూజీలోనుండి వొచ్చానా? నామీదే కేసులున్నాయి? నాపేరు యే పోలీస్టేషన్లో వుంది? నేనెందులో ముద్దాయిని? మరెందుకని... వొకటి కాదు రెండు కాదు... పదిహేనేళ్ళు... పదిహేనేళ్ళు చేసిన పర్మినెంటుద్యోగం యెందుకు పోయింది? యెందుకు తీస్సారు? నీనే కాదు, నాకే కాదు... అడిగిన వాళ్ళకీ అడగని వాళ్ళకీ గోల్డెన్ షేక్ హేండులని - ఐరన్ హేండులిచ్చారెందుకు? వుద్యోగాలు తీసేసారెందుకు. యేకంగా కంపెనీలకు కంపెనీలు కార్పోరేషన్లకి కార్పోరేషన్లే మూసేసారు... అమ్మేసారు... ముక్కలు విడగొట్టి ప్రవేటుగ కాకులకీ గద్దలకీ పడేసారు...?... దళాలు తయారవుతున్నాయనా? గెరిల్లా జోన్సుపెట్టామనా?...."

ఈ బుద్ధుడికి... యే బోధివృక్షం కింద జ్ఞానోదయమయిందో తెలీదు.... పిచ్చివాడిలా(?) వాగుతున్నాడు. వాళ్ళ వుపవాసం నేనూ తిని, పుణ్యం మూటగట్టుకొని రైల్లో కూచున్నాను..

బుద్ధుడు వదలడేం..?!

తల వేడెక్కిపోతోంది. కణతలు రెండు అరచేతులతో నొక్కుకుంటూ అలాగే వేళ్ళని వెనక్కి పోనిస్తే... నున్నగా తగిలింది గుండు...! తిరుపతి గుండు!!

చేసిన తప్పుకు ఎవరో పట్టుకొని గుండుగీయించడం... చిన్నప్పుడెప్పుడో విన్న కథో, అమ్మ చెప్పిన మాటో గుర్తుకు వచ్చింది.

యిప్పుడు సిగ్గుపడ్డానికి కూడా సిగ్గేస్తోంది!?

'పీక పోతే పీక రాదుగాని, ఈక పోతే ఈకరాదా? రెండ్రోజులకు మొలిసి నాల్రోజులకి బలిసిపోదూ?' మావయ్య యేదో అంటున్నాడు.

సర్వం యెవరో దోచుకు పోయినట్టు 'గోవిందా...గోఁ..విందా' అరుస్తున్నారు తోటి ప్రయాణీకులు!

యింతకీ తన ఈక తెగిందా?.... పీక తెగిందా?!

# 17

'దుక్కిదున్నే రైతు సేతులకి

బేడీలెందుకురో రన్నా....'

... మీరు పాటలు బాగా పాడతారు...' మసకమసక చీకట్లో అరుగు మీద కుర్చీలో వున్న యస్పైగారు తనని మెచ్చుకున్నారు. కింద మటం దిద్దిన యేడ్దూ,. దిగవ నిలబడ్డ కానిస్టేబిలూ కార్యం వేగం కానిస్తే యెలిపోదుం అన్నట్టుగున్నారు.

'పాటగాదండీ.. అడుగుతున్నాను... వాణ్ణెవణ్నో యెందుకండి అరెష్టు చేసారు?' అన్నాడు తనూ యెదురు కుర్చీలో నుండి ముందుకి వంగి!

'పునరావాసం మీ అక్కు.... ఆస్తి... ప్రివిలైజా.......' అని గుర్తుచేసాడు యేడ్డు.

'నిజవేఁ... అదే మా బూమ్మీద మిలట్రీ వోడికి 'డీ' పట్టా యోలాగిచ్చిందండి గవర్నమెంటు' సీనియారిటీ రాని కానిస్టేబిల్ నిజాయితీగానే అడిగాడు.

'గవర్నమెంటెవుర్రా.... మనమే గదా...' అన్నాడు మళ్ళీ యేడ్డు.

అవునవునన్నట్టు తలాడించాడు కానిస్టేబిలు.

'వొదిలేయండి... ఆ మిలట్రీవాడు దున్నమంటే ఆరైతెవడో దున్నాడు, నేను కోర్టులో తేల్చుకుంటాను...' అన్నాడు తను.

'మీరు మధ్యలో వొదిలేయొచ్చుగాక... అయినా ఆనాటి నుండి ఈనాటి వరకూ మీకిచ్చిన లేండు మీద మీరేసిన బోరింగూ, షెల్టరూ, సిమ్మెంటు ఫిల్లర్లు దించిన కంచె... యింకా బావీ గీవి... లక్షన్నరా రెండు లక్షలు మీపేర్న ఖర్చు జరిగింది. ఖర్చయింది అప్పే ... ! అది మిలట్రీ వోడు తీర్చడు. మీకే వస్తుంది...' మీరే తీర్చాల యస్పై 'లా' రెండేళ్ళు చదివి మధ్యలో వదిలి ఈ వుజ్జోగానికొచ్చాడు.

''థాంక్యూ... మీరందరున్నారు...'' అన్నాడుతను.

పెళ్ళయిన తర్వాత- కార్డిచ్చిన చాన్నాళ్ళకి- యింటి కొచ్చారు పోలీసు సిబ్బంది. ఫార్మాలిటీ ప్రకారం మందూ గిందూ తిండి గిండీ అయిపోయాయి, అదీ యీ మైత్రీ సదస్సుల పుణ్యమా అని.

వెళ్తూ వెళ్తూ హైదరాబాద్ మిాత్రావాలి, కొత్త పెళ్ళి కొడుకునని తప్పించుకోడానికి వీళ్ళేదు. గుర్తుందిగదా, 'లొంగిపోయిన నక్సల్స్ సదస్సు'కి మంత్రిగారి చేతిమీదుగా పట్టాలు అందుకుందురు...' అన్నాడు గిఫ్ట్‌గా యస్పై.

సెలవని వంటి చేత్తో సలాం కొట్టి వెళ్ళారంతా.

'పునరావాసం స్థిరచరాస్థులు ఐదులక్షలు వదులుకోకూడదు...' తను గట్టిగా తీర్మానించుకున్నాడు. దానికోసం ఎంత తిరిగాడు? పోయిన వుజ్జోగం పోయినా తనకిచ్చింది తనకిమ్మని మళ్ళీ రిప్రజెంటేషను పెట్టుకున్నాడు. యిలాంటితప్పు యిక చేయనని, మానసిక

వైకల్యం (మెంటల్ డిప్రెషన్) వల్ల అలా ప్రవర్తించానని, ఆరోగ్యం కుదిట పడింది బాగా ఆలోచించ గలుగుతున్నానని రిటన్‌గా యిచ్చాడు. స్యూరిటీలు పెట్టించాడు. రికమెండు చేయించాడు. చేతికి ఎముకలేకుండా తనే దగ్గరుండి చేతులన్నీ తడిపితే- యివాళది మొక్కై మొలిచింది. చీడపీడలుంటాయి. మందులు కొట్టిద్దాం....ఆశావహంగావున్నాడు.

వుండక పోతే గొఱ్ఱెపిల్లల పెంపకం ప్రారంభిస్తాడూ?!

యేదో సమయానికి ఆ ఎమ్మెల్యేగారు జన్మభూమి'లోని కాంట్రాక్టు పనులన్నీ తనకు యిప్పించారు. తనూ యెవ్వరి ఋణమూ వుంచుకోలేదు. తృణమిచ్చినోలుకి పణం పెట్టాడు. పెడుతున్నాడు.

యిక వూర్లో 'తమ' నాయుళ్ళే యెక్కువ... వాళ్ళకి తక్కువ చేసిందీ లేదు. అంత పెళ్ళి బిజీలో కూడా దగ్గరుండి (కుల) సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి పెట్టాడు. కార్యవర్గాన్ని పెట్టి మ్యారేజీ కన్సల్టెన్సీ పెట్టి చుట్టు పక్కల వూళ్ళకీ పాకిపోయాడు.

యెవరది? పక్కింటి ముసలి... పడుచు ముసల్దేనా? తలతిప్పుకుపోతోందే?!

దానికే కాదు, చాలా మందికి అంతే... బాగు పడ్డాడని ఈర్ష్య. చెడిపోతే యేం చేడిపోయినావని అడుగు తారుగాని, అయినా బాగు పడితే- తన నేమని అడుగుతారు? లేకపోతే డ్వాక్రా సంఘంల అడిగినంత యిప్పించలేదనా? యేమో?!

ఐటీడియ్యే పనులూ... కాంట్రాక్టులూ....

అందరికీ తన్కెడ పనులు సంపాదించి పెట్టగలడు?

ఆర్టీసికి సలహా మండలి సభ్యుణ్నేగాని... చైర్మెన్ని కానుగదా, వీళ్ళ పిల్లలందరికీ వుద్యోగాలంటే ధరలు పెరిగిపోయాయి. వీళ్ళెక్కడ అందుకోగలరు? తనెక్కడ అందించగలడు?

అందరికీ చేసి పెట్టలేదనా? అమ్మకెందుకో కోపం?

ముసలయిన కొద్దీ ఛాదస్తం పెరిగిపోదూ? మనమేం చేస్తాం.. యేం పట్టించుకుంటాం?

అయినా-

తనదా చిన్ని బుర్ర...

బుర్ర పట్టుని ఆలోచనలెందుకూ? మళ్ళీ సెగ్గెక్కువయితే తన ఆరోగ్యం పాడవుతుందని హోం డిపార్టుమెంటు బెంగ...

పొద్దున్నే 'నీరూ-మీరు' వుంది!

'మీ నీరు మీరు చూసుకొండి'

నిజమే, ఎవరి నీరు వారే చూసుకోవాలి!

వానలు రాకుండానే 'యింకుడు గుమ్మిలు' తవ్వుకోవాలి! దీపముండగానే యిల్లు చక్క

బెట్టుకోవాలి! స్వరం... పిలిచిందా? పిలవగానే వెళ్ళాలి.. నా భార్య నా పిల్లలూ... నా ప్రపంచమూ...

నాది... నాది... నాది... నాది... నాది... అనాది నుండి 'నాది' అనేది వుంది గదా?!

యిది నా జీవన స్రవంతి! జనజీవన స్రవంతిలో నేనూ?!

## 18

యెవరెన్ని తప్పినా- తప్పకపోయినా...

చరిత్రగతి తప్పనట్టు...

స్వరం' నెల తప్పింది!

ముందుకు పొడుచుకొచ్చిన పొట్ట మీద తను ముద్దు పెట్టబోతూ అటూ యిటూ చూసాడు.

యెందుకు భయం? అన్నట్టు చూసింది స్వరం....

'నేను పసి పాపల్ని ముద్దాడితే

వారి చెక్కిళ్ళ మీద తడిని

కత్తులతో చెరుపు తారు...."

అన్నయ్య ఆఖరి కొడుకు కూడబలుక్కు చదువు తున్నాడు. గబుక్కున వెళ్ళి వాడి చేతిలో మాసి ఎలుకలు కొరికేసిన పుస్తకాన్ని అమాంతం లాగేసుకున్నా- చేతులు వణుకుతున్నాయి. తీసుకెళ్ళి పొయ్యిలో పడేసి వొచ్చాడు.

యెలా మిస్సయిందో? లైబ్రరీని... మొత్తం పుస్తకాల్ని తగలెట్టేసాడుగా?!... 'వొలమ్మ వోలమ్మ సరస్వతీ దేవిరా... తప్పురా తప్పురా నీ కిష్టం లేకపోతే యెవులి కయినా యిచ్చీరా' అని అమ్మ అడ్డం పడింది. అదే యెక్కడో దాసుంటుంది?!...

ఆ పిల్లాడక్కడలేడు...

ఆర్పేసి ఆ పుస్తకాన్ని తీయలేదుగదా మళ్ళీ...

వొల్లంతా వొణుకుతోంది, లేవడానికి శక్తి చాల్లేదు... నుదురు మీద చెమట... తుడుచుకున్నా... తడితడిగా దడిగడుతోంది...

స్వరం గమనిస్తోందా? నవ్వుతోందేం?!

'పాపకావాలా? బాబు కావాలా?' స్వరమడిగిందా?

'యెవ్వరయినా నాకొకటే...' తను జవాబివ్వలేదే, స్వరమిచ్చిందా?! అయితే ప్రశ్న తను వేసాడా? చలాకీగా వుండడానికి ప్రయత్నించాడు.

'మన బిడ్డని పెద్దయితే యేం చేద్దాం...' స్వరమే అడుగుతోంది.

యేదో వొకటిలే' అందామనుకున్నాడు, అనలే.

'నక్సలైటుని చేద్దాం...'

మళ్ళీ స్వరమే. తీవ్రంగాలేదు.. తీవ్రంగా వుంది.. వుందీ? ఆకతాయిగా అనొద్దు' అనాలనుకున్నాడు. నోర్రాలేదు. 'అలాంటి జోకులెందుకు' చెపుదామనుకున్నాడు, చేత కాలేదు. అలాంటివి మాట్లాడకూడదీ సమయంలో ' అని నోటి కడ్డంగా వేలిని వుంచబోయాడు, వొణుకుతూ వుండడంతో వేలినే కాదు చేతినీ దాచుకున్నాడు.

"మీలాక్కాదులే..."

వెక్కిరిస్తోందా? ఆటపట్టిస్తోందా? నవ్వుతోందే.. పడి పడి నవ్వుతోందే?!... పిచ్చెక్కిందా?... తనకా? నాకా? ఎవరికి? గల గల గలమని యేరులాంటి నవ్వు. తనుకొట్టుకు పోతున్నాడు.. పోడూ..?!

అదేంటి నా నవ్వుల నావ... సుస్వరాల స్వరం... అలా చుట్టుకు పోతోందేం?.. కడుపు నొప్పా... నడుంమీద చేతులేమిటి? పొట్టని బాదుకుంటుందేం..... తడ తడిగా... రెండుకాళ్ళ మధ్య యిదేమిటి? రక్తం కాదు... నీరూ కాదు... మరి...

క్షణాల్లో ఆసుపత్రికి తరలిస్తున్నారు...

అమ్మలక్కలుచుట్టు ముట్టారు...

'నేలను వేళ్ళతోటి

గోకింది గుమ్మడి

భూగోళాన్ని పిడికిళ్ళతోటి

పట్టింది గుమ్మడి

పడమరను పాదాలతోటి

తన్నింది గుమ్మడి

ఆకాశాన్ని బీపితోటి

గగనానికి తోసింది గుమ్మడి...'

చుట్టు ముట్టారు...

జనం...

అగుపడదేం...

వైద్యుడే వచ్చాడు!

కొన్ని గంటల తెరచాపలెత్తాక-

"... నెలలు నిండక... నొప్పులు రాక ముందే... తల్లిదాయి నలిగిపోవడంవల్ల వుమ్మనీటి సంచి నలిగి చిట్లింది... వుమ్మ నీరు పోయింది... ఆనీట్లో నాని పెరగాల్సిన శిశువుకి నీరందకపోతే - ఆ

నీరు తాగినా ఆ పేగులు తలకి చుట్టు కున్నా కాళ్ళా చేతులకి వేసుకున్నా బిడ్డకి ప్రమాదం. వుండనిస్తే తల్లికి ప్రమాదం..."

అలాంటప్పుడు బిడ్డని తీసేయండి... అందరిమాట, జనం గొంతు!

"సెట్టంటూ వుంటే... మరికాయదా మరి పుయ్యదా?!"

"తల్లి కడుపుల గింజుండాలగాని కొండకట్టీదూ..."

"పోయింది పొల్లు... వున్నిది గట్టి..."

'బిడ్డబతకదా?' తను బతకడా?' అన్నట్టుగా అడిగాడు.

"బతికినా... నెల తక్కువ బిడ్డలంటారు గదా, చూసే వుంటారు గదా... జబ్బులతోటి బతికినంత కాలం రోగాలతోటి రొష్టులతోటి ఆలకీ సుకంలేక... మనకీ సుకం లేక... నిత్యం చచ్చీ బతకడం కన్నా..."

వైద్యుడా? శాస్త్రకారుడా?

చెపుతున్నది సైన్సా? సామాజిక శాస్త్రమా?

'అది తన శవమా? తన బిడ్డ శవమా?'

అర్థం గాకుండా అయోమయంగావుంది...

'ఆడొద్దు, మగపిల్లలని, లాభాల ఆశ చూపించి భ్రూణ హత్యలకు పూనుకున్న వాళ్ళూ వున్నారు. వాళ్ళు జీవితాలు నిలబెట్టడానికి కాదు, తమ జీవనం కోసం వ్యాపారం చేస్తూ 'వృత్తి' ధర్మమంటున్నారు!?'

పోలీసులు వినగలరు, తను చెవులు మూసుకున్నాడు. కళ్ళూ మూసుకున్నాడు. నోరూ మూసుకున్నాడు.

గాంధీ గారి కోతి గార్రై పోయాడు!

మళ్ళీ మళ్ళీ మళ్లీ శవమై పోతున్నాడు!

'... నేను గీతాన్ని

కేరింతలు కొట్టి

పరులకైత తమదని భరిమ్రోగించి చలామణీ చేయించే

చాపల్యాల చవుక బారు కామోద్రేకానికి

చచ్చి పుచ్చి పోయిన పిండాన్ని....'

తనని తను తడుముకున్నాడు. యెవరో గొంతెత్తి యేళ్ళ తరబడి పాడుతున్నట్టే వుంది, పంక్తులు జారిపోతూ వున్నాయి, చెవుల మీదుగా!

'... నేను గీతాన్ని
అసహ్యంగా అసభ్యంగా
బహిరంగంగా బాహాటంగా
సిగ్గులేక-చావచక్యంలేక- చాతకాక
నీచంగా ఛండాలంగా
చెరచబడ్డ గీతాన్ని
చిత్రింపబడ్డ భూతాన్ని-
తెగింది పాటా?
పల్లవా? చరణమా? కవితా? గానమా? ప్రాణమా?
మెడకు వేసుకున్న తాడు... తాడే తెగింది!
తను ఆత్మహత్య చేసుకోబోయాడు!

'వూయల కర్ర కట్టబోయి పడ్డారు..." స్వరం పదిమందికి సర్ది చెప్పి పంపింది. అసత్యంతో అవహేళనతో ఆఖరి గడియలూ...

'బిడ్డ పోయిన దుఃఖం నుంచి మీరింకా బయట పడినట్టులేరు... అయినా మరి మనకి పిల్లలే పుట్టరా?'

స్వరం కోలుకొని, తనని కోలుకో నిస్తోందా?
ఆమె వొడిలో మృత శిశువులా... కదలక... మెదలక...
స్వరం కదులుతోంది... గాలై .. గీతమై... సంగీతమై...
-.. ఒక వీరుడు నేలకొరిగితే
ప్రభవింతురు వేల వీరులూ!-

★ ★ ★

*రచనా కాలం : జూన్ రెండవ వారం ' 2000*
*(అముద్రితం)*